SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుక.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.
7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 286 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శనివారం 5 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |



## కేబినెట్‌లోకి రాములమ్మ!?

తెలంగాణ రాజకీయాల్లో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ అంశం తీవ్ర కలకలం రేపుతోంది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన నేపథ్యంలో, ఆమె స్థానంలో మరో బలమైన మహిళా నేతను రేవంత్ రెడ్డి కేబినెట్‌లోకి తీసుకునేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సినీ నటి విజయశాంతి పేరు తెరపైకి వచ్చి ప్రధానంగా వినిపిస్తోంది. 2

- మంత్రి పదవిపై విజయశాంతి పేరు జోరుగా ప్రచారం
- మహిళా కోటాలో అవకాశం కల్పించే యోచన
- అధిష్ఠానంతో చర్చలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం
- హోంశాఖపై విజయశాంతి ఆసక్తి అంటూ ఊహాగానాలు
- మరోవైపు ఆది శ్రీనివాస్ పేరూ పరిశీలనలో!

## నేను ఎక్కడికీ వెళ్లడం లేదు



- మాజీ మంత్రి కొండా సురేఖ
- కాంగ్రెస్‌ను వీడేది లేదని ప్రకటన
- బీజేపీ.. కొత్త పార్టీ ప్రచారాన్ని తోసిపుచ్చిన సురేఖ
- సోషల్ మీడియా పోస్టులతో సంబంధం లేదని స్పష్టీకరణ
- కేసీఆర్‌పై సురేఖ ప్రశంసలు! 3



## సీఎం సెక్యూరిటీ సమాచారం లీక్ 2

'తెలుగు స్క్రైబ్' ఎక్స్ ఖాతాపై కేసు నమోదు

సీఎస్‌వో కేబీ ఫ్రాంక్లిన్ ఫిర్యాదుతో చర్యలు

రహస్య సమాచారం ఎలా బయటకు వెళ్లిందనే దానిపై దర్యాప్తు

అధికారుల పాత్రపైనా పోలీసుల ఆరా

# అభివృద్ధి పనులు పరుగులు పెట్టాలి

నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటన

- హకీంపేట ఎడ్యుకేషన్ హబ్‌పై ఉన్నతస్థాయి సమీక్ష
- భూములిచ్చిన రైతు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు
- విద్యా సంస్థల నిర్మాణాల్లో నాణ్యతకు పెద్దపీట
- ఎత్తిపోతల పథకం.. రోడ్లపై ప్రత్యేక దృష్టి



**హకీంపేట, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో సీఎం రేవంత్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. మద్దూరు, దౌల్తాబాద్, హకీంపేట ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న విద్యా సంస్థలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం హకీంపేటలో ఉన్నతాధికారులతో సమావేశమై కొడంగల్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. విద్యా సంస్థలు, సాగునీటి పథకాలు, రహదారులు సహా అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నారాయణపేట జిల్లా మద్దూరులో ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలను సీఎం తొలుత పరిశీలించారు. నిర్మాణ ప్రణాళికలను పరిశీలిస్తూ ప్రాంగణమంతా కలియతిరిగి అధికారులకు పలు సూచనలు చేశారు. గతంలో ఈ స్థలం కోసం భూములిచ్చిన రైతులను ప్రత్యేకంగా గుర్తించి వారితో మాట్లాడారు. భూములిచ్చిన ప్రతి రైతు

మిగతా 2 లో

## జేఎన్టీయూలో విద్యార్థుల మధ్య ఘర్షణలు

కర్రలతో విద్యార్థులు పరస్పర దాడులు

 2



## కొత్తగా 'చేయూత' పింఛన్లు

- దరఖాస్తులకు ఈ నెల 15 వరకు అవకాశం
- పత్రాలు లేకున్నా ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఛాన్స్
- పరిశీలన సమయంలో ధ్రువపత్రాలు తప్పనిసరి 3

## హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవు

- బాధ కలిగించినా పార్టీ క్రమశిక్షణే ముఖ్యం
- సుస్మిత వ్యాఖ్యలను ఖండించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన అధిష్ఠానం
- సమస్యలుంటే పార్టీలోనే చర్చించాలి
- సురేఖ కాంగ్రెస్‌లోనే కొనసాగాలని కోరుకుంటున్నాం.. 2
- సురేఖ తొలగింపుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్





## సన్నబియ్యం అమ్మితే.. రేషన్ కార్డు కట్!

- లబ్ధిదారులకు మంత్రి తుమ్మల గట్టి హెచ్చరిక
- పేదలకు ఇళ్లు ఇవ్వకుంటే సర్పంచులపై చర్యలు 2
- పోడు భూముల సమస్యకు త్వరలో పరిష్కారం
- కరువు నేపథ్యంలో పామాయిల్ సాగుకు ప్రోత్సాహం
- రఘునాథపాలెంలో రూ.75 కోట్లతో రోడ్లు

## మహిళపై లైంగిక దాడి యత్నం.. అడ్డుకున్న వీధికుక్క!


- కోయంబత్తూరులో వెలుగులోకి వచ్చిన ఘటన
- మహిళ కేకలకు స్పందించిన శునకం



.. వివరాలు 4లో

## ఢిల్లీని ముంచెత్తిన కుండపోత వర్షం

- జలదిగ్బంధంలో ఎయిర్‌పోర్ట్
- దేశ రాజధానిలో భారీ వర్షపాతం నమోదు 4



## నింగిలోకి ఈవోఎస్-05

- ఇస్రో ఖాతాలో మరో భారీ విజయం!
- భూస్థిర కక్ష్యలో పని చేయనున్న ఇమేజింగ్ శాటిలైట్
- ఐదేళ్ల క్రితం విఫలమైన మిషన్‌కు ప్రత్యామ్నాయం 4





### హద్దులు దాటితే ఎవరిపైనైనా

# చర్యలు తప్పవు

**సురేఖ తొలగింపుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్**

**బాధ కలిగించినా పార్టీ క్రమశిక్షణే ముఖ్యం**

**సుస్మిత వ్యాఖ్యలను ఖండించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన అధిష్ఠానం**

**సమస్యలుంటే పార్టీలోనే చర్చించాలి**

**సురేఖ కాంగ్రెస్‌లోనే కొనసాగాలని కోరుకుంటున్నాం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** కాంగ్రెస్ పార్టీలో ఎంతటి నాయకుడైనా క్రమశిక్షణ హద్దులు దాటితే చర్యలు తప్పవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కొండా సురేఖను తెలంగాణ మంత్రివర్గం నుంచి తొలగించడం బాధ కలిగించే పరిణామమే అయినప్పటికీ.. పార్టీ క్రమశిక్షణ అన్నింటికంటే ముఖ్యమని తేల్చిచెప్పారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన సురేఖపై అధిష్ఠానం తీసుకున్న చర్యకు దారితీసిన పరిణామాలను వివరించారు. కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ తీవ్రంగా పరిగణించిందని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఈ వ్యవహారంలో ఆమె వైఖరిపై క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే అధిష్ఠానం చర్యలు తీసుకుందని చెప్పారు. పార్టీలో ఏవైనా సమస్యలు, అసంతృప్తులు ఉంటే చర్చించేందుకు అనేక అంతర్గత వేదికలు అందుబాటులో ఉన్నాయని మహేశ్ గౌడ్ గుర్తుచేశారు. పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి తదితరుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లవచ్చన్నారు. వాటిని పక్కనపెట్టి బహిరంగంగా మీడియా ముందు పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడటాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. “కాంగ్రెస్ పార్టీలో ఎవరైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు. నాయకుడు ఎంతటి వారైనా క్రమశిక్షణ విషయంలో మినహాయింపు ఉండదు” అని మహేశ్ గౌడ్ తేల్చిచెప్పారు. సురేఖపై చర్య తీసుకున్నప్పటికీ ఆమె కాంగ్రెస్‌లోనే కొనసాగాలని తాము కోరుకుంటున్నట్లు మహేశ్ గౌడ్ తెలిపారు. పార్టీలో కొనసాగితే భవిష్యత్తులో ఆమెకు అవకాశాలు వస్తాయని సూచనప్రాయంగా వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ కాంగ్రెస్ పార్టీ బీసీలకు తగిన ప్రాధాన్యం ఇస్తుందని మహేశ్‌కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించిన నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# సన్నబియ్యం అమ్మితే.. రేషన్ కార్డు కట్!

**లబ్ధిదారులకు మంత్రి తుమ్మల గట్టి హెచ్చరిక**

**పేదలకు ఇళ్లు ఇవ్వకుంటే సర్పంచులపై చర్యలు**

**పోడు భూముల సమస్యకు త్వరలో పరిష్కారం**

**కరువు నేపథ్యంలో పామాయిల్ సాగుకు ప్రోత్సాహం**

**రఘునాథపాలెంలో రూ.75 కోట్లతో రోడ్లు**

**ఖమ్మం, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సన్నబియ్యాన్ని బయట విక్రయిస్తే రేషన్ కార్డులు రద్దు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. పేదల ఆకలి తీర్చాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పూతాని తండాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నబియ్యాన్ని కొందరు లబ్ధిదారులు బయట విక్రయిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తుమ్మల తెలిపారు. ఇది సరైన పద్ధతి కాదని, పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దుర్వినియోగం చేయవద్దని సూచించారు. సన్నబియ్యాన్ని విక్రయిస్తున్న వారిని గుర్తిస్తే వారి రేషన్ కార్డులను రద్దు చేసేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి, ముఖ్యంగా గుడిసెల్లో నివసిస్తున్న వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను మంత్రి ఆదేశించారు. ఇళ్ల ఎంపికలో రాజకీయాలకు తావులేకుండా పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. అర్హులైన పేదలకు ఇళ్లు అందేలా చూడటంలో నిర్లక్ష్యం వహిస్తే సర్పంచుల పదవులపైనా ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని, కరువు పరిస్థితులు తలెత్తే అవకాశముందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నట్లు తుమ్మల పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. పామాయిల్ సాగును చేపట్టే రైతులకు ప్రభుత్వం అవసరమైన సదుపాయాలు కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. రఘునాథపాలెం మండల రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సాగునీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనులు చేపట్టవచ్చని తెలిపారు. అటవీ హక్కుల గుర్తింపు పట్టాలు ఉన్న రైతులకు నిబంధనల మేరకు బోరుబావుల అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న పోడు భూముల సమస్యను త్వరలోనే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తుమ్మల హామీ ఇచ్చారు. పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. రఘునాథపాలెం మండలంలో రూ.75 కోట్లతో సుమారు 200 డంపర్ రోడ్లతో పాటు రైతులు పొలాలకు వెళ్లేందుకు అవసరమైన దారులను నిర్మిస్తామని ప్రకటించారు. విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తూ త్వరలోనే స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

# అభివృద్ధి పనులు పరుగులు పెట్టాలి

మొదటి పేజీ తరువాయి

కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానికులను పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు వినతిపత్రాలను స్వీకరించారు. మద్దూరులో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల పనులను కూడా సీఎం పరిశీలించారు. కళాశాల డిజైన్లు, లేఅవుట్‌ను పరిశీలించి పలు మార్పులు సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలు చేపట్టాలని, కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఆదేశించారు. నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా భవనాన్ని పూర్తి చేయాలని స్పష్టం చేశారు.



**హకీంపేటలో భారీ విద్యా హబ్**

అనంతరం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట చేరుకున్న సీఎం.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వివిధ కళాశాలలు, హాస్టళ్లు, ఇతర భవన సముదాయాల నిర్మాణాలను ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎడ్యుకేషన్ హబ్‌లో భాగంగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య, వెటర్నరీ,



నర్సింగ్, ఫిజియోథెరపీ, పారామెడికల్, ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు 400 పడకల ఆసుపత్రి, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, హాస్టళ్ల భవన సముదాయాలను సీఎం పరిశీలించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. నాణ్యత, సాంకేతిక ప్రమాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాకాలంలో ప్రాంగణంలో నీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ బావులు ఏర్పాటు చేయాలని, వర్షపు నీటిని సంరక్షించి ల్యాండ్‌స్కేపింగ్‌కు ఉపయోగించుకునేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

**దౌల్తాబాద్‌లోనూ పరిశీలన**

జిల్లాల పర్యటనలో భాగంగా వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం గోకఫసల్‌వాద్ గ్రామంలో నిర్మిస్తున్న బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల పనులను సీఎం పరిశీలించారు. దౌల్తాబాద్ పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన పనుల పురోగతిని కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

**ఎత్తిపోతల పథకంపై ప్రత్యేక సమీక్ష**

హకీంపేటలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో కొడంగల్ నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులపై సీఎం సమగ్రంగా సమీక్షించారు. మక్తల్--నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకం, నియోజకవర్గంలోని రోడ్ల అనుసంధానం, ప్రభుత్వ భవనాల నిర్మాణం, తండాలకు రహదారులు, ఇతర మౌలిక వసతుల పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. శాఖల మధ్య సమన్వయం పెంచుకుని పనుల్లో జాప్యానికి తావివ్వకుండా ముందుకు సాగాలని ఆదేశించారు. విద్యా హబ్ నుంచి ఎత్తిపోతల పథకం వరకు.. కొడంగల్ నియోజకవర్గంలో చేపట్టిన ప్రతి అభివృద్ధి ప్రాజెక్టు నిర్ణీత గడువులోగా ప్రజలకు అందుబాటులోకి రావాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# సీఎం సెక్యూరిటీ సమాచారం లీక్

- ఢిల్లీ పర్యటన భద్రతా వివరాలు సామాజిక మాధ్యమాల్లోకి
- ‘తెలుగు స్క్రైబ్’ ఎక్స్ ఖాతాపై కేసు నమోదు
- సీఎస్‌వో కేబీ ఫ్రాంక్లిన్ ఫిర్యాదుతో చర్యలు
- రహస్య సమాచారం ఎలా బయటకు వెళ్లిందనే దానిపై దర్యాప్తు
- అధికారుల పాత్రపైనా పోలీసుల ఆరా

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రతకు సంబంధించిన అత్యంత సున్నితమైన సమాచారం సామాజిక మాధ్యమాల్లోకి రావడం కలకలం రేపింది. సీఎం ఢిల్లీ పర్యటన సందర్భంగా రూపొందించిన బందోబస్తు వివరాలను ‘తెలుగు స్క్రైబ్’ పేరుతో ఉన్న ఎక్స్ ఖాతాలో పోస్టు చేసిన వ్యవహారంపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముఖ్యమంత్రి ప్రధాన భద్రతాధికారి కేబీ ఫ్రాంక్లిన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. సీఎం ఢిల్లీ పర్యటనకు సంబంధించి నిమిషాల వారీ కార్యక్రమం, భద్రతా ఏర్పాట్లతో కూడిన సమాచారాన్ని సంబంధిత ఉన్నతాధికారులకు వైర్‌లెస్ సందేశం ద్వారా పంపినట్లు ఫ్రాంక్లిన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులు, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్, రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, డీజీపీ తదితర సంబంధిత అధికారులకు మాత్రమే ఈ సమాచారం చేరాల్సి ఉందని తెలిపారు.

**పర్యటన సాగుతుండగానే పోస్టు!**

ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన కొనసాగుతున్న సమయంలోనే భద్రతకు సంబంధించిన రహస్య వైర్‌లెస్ సందేశంలోని వివరాలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఎం పర్యటన షెడ్యూల్‌తో పాటు భద్రతాపరంగా సున్నితమైన మరికొన్ని వివరాలు కూడా అందులో ఉన్నట్లు



తెలిపారు. దీంతో ముఖ్యమంత్రి భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని సీఎస్‌వో ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. నిబంధనల ప్రకారం ఇలాంటి వైర్‌లెస్ సందేశాలు బయటకు వెళ్లకూడదని, సంబంధిత వ్యవస్థలోని ఎవరో ఈ సమాచారాన్ని సామాజిక మాధ్యమ ఖాతాకు చేరవేసి ఉండవచ్చని సీఎస్‌వో తన ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సమాచారం ఎక్కడి నుంచి, ఎవరి ద్వారా బయటకు వెళ్లిందనే అంశాన్ని గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**సైబర్ క్రైమ్‌కు కేసు బదిలీ**

ఈ వ్యవహారంపై తొలుత ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతరం హైదరాబాద్ అదనపు పోలీసు కమిషనర్ (క్రైమ్స్) ఆదేశాల మేరకు సమగ్ర దర్యాప్తు కోసం కేసును సిటీ సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ చేసి తిరిగి నమోదు చేసినట్లు సమాచారం. సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన ఖాతాకు రహస్య సమాచారం ఎలా చేరింది? అధికారిక వ్యవస్థలో ఎక్కడైనా సమాచారం లీకైందా? ఇందులో ఎవరెవరి పాత్ర ఉంది? అనే కోణాల్లో సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి భద్రతకు సంబంధించిన వ్యవహారం కావడంతో సమాచార లీకేజీ మూలాన్ని గుర్తించడంపై పోలీసులు ప్రధానంగా దృష్టి సారించారు.

# కేబినెట్‌లోకి ‘రాములమ్మ’!?

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** తెలంగాణ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై మరోసారి రాజకీయ చర్చ జోరందుకుంది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన నేపథ్యంలో ఆమె స్థానంలో మరో మహిళా నేతకు అవకాశం కల్పించే అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సినీనటి విజయశాంతి పేరు ప్రధానంగా తెరపైకి వచ్చింది. మంత్రి పదవి విషయమై ఆమె అధిష్ఠానం పెద్దలతో చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు సమాచారం. కొండా సురేఖ మంత్రివర్గం నుంచి వైదొలగడంతో ప్రస్తుతం రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో సీతక్క ఒక్కరే మహిళా మంత్రిగా ఉన్నారు. దీంతో మరో మహిళకు ప్రాతినిధ్యం కల్పించాలనే ఆలోచన కాంగ్రెస్ నాయకత్వంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ‘రాములమ్మ’గా గుర్తింపు పొందిన విజయశాంతి పేరు బలంగా వినిపిస్తోంది. మహిళా కోటాలో విజయశాంతితో పాటు పాలకుర్తి ఎమ్మెల్యే మమిడాల యశస్వినీరెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే వీరిలో ఎవరికి అవకాశం దక్కుతుందనే దానిపై పార్టీ నుంచి అధికారిక సంకేతాలేవీ వెలువడలేదు. తెలంగాణ రాజకీయాల్లో ఫైర్‌బ్రాండ్ నేతగా విజయశాంతికి గుర్తింపు ఉంది. గతంలో బీఆర్ఎస్ తరఫున ఎంపీగా పనిచేసిన అనుభవంతో ఆ పార్టీ రాజకీయ వ్యూహాలు, నేతల వ్యవహారశైలిపై ఆమెకు అవగాహన ఉందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కొనేందుకు విజయశాంతి వంటి బలమైన స్వరం మంత్రివర్గంలో ఉంటే పార్టీకి ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం కూడా రాష్ట్ర నాయకత్వంలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. మంత్రి పదవిపై చర్చల నేపథ్యంలో విజయశాంతి ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలను కలిసే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తన రాజకీయ భవిష్యత్తుతో పాటు మంత్రివర్గంలో అవకాశం కల్పించే అంశంపైనా చర్చించవచ్చని తెలుస్తోంది. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ఆమెకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. అప్పటి నుంచి కీలక రాజకీయ పరిణామాలపై తనదైన శైలిలో స్పందిస్తూ వస్తున్నారు. విజయశాంతికి మంత్రి పదవి దక్కితే హోంశాఖ కావాలని కోరుతున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో మరింత ఆసక్తి రేపుతోంది. అయితే ఈ అంశంపై విజయశాంతి గానీ, కాంగ్రెస్ అధిష్ఠానం గానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అందువల్ల హోంశాఖకు సంబంధించిన ప్రచారాన్ని ప్రస్తుతం ఊహాగానంగానే చూడాల్సి ఉంది. మరోవైపు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కూడా మంత్రివర్గంలోకి తీసుకునే అంశం పరిశీలనలో ఉన్నట్లు



సమాచారం. కేబినెట్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తూ కొత్త ముఖాలకు అవకాశం కల్పించడంతో పాటు కొందరు సీనియర్ మంత్రుల శాఖల్లో మార్పులు చేసే అవకాశంపైనా చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. విజయశాంతికి నిజంగానే మంత్రి పదవి దక్కుతుందా..? మహిళా కోటాలో ‘రాములమ్మ’కు అధిష్ఠానం పచ్చజెండా ఊపుతుందా..? ఒకవేళ కేబినెట్‌లోకి వస్తే ఆమెకు ఏ శాఖ దక్కుతుంది..? అన్న ప్రశ్నలకు కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకునే తుది నిర్ణయమే సమాధానం చెప్పనుంది.

# జేఎన్టీయూలో విద్యార్థుల మధ్య ఘర్షణలు..

**కర్రలతో విద్యార్థులు పరస్పర దాడులు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** హైదరాబాద్‌లోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థుల మధ్య వాగ్వాదం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. గురువారం రాత్రి తీజ్ వేడుకల్లో ఓ విద్యార్థిపై దాడిచేయడంతో ఘర్షణగా మారింది. అనంతరం గౌతమి, మంజీరా హాస్టళ్లలోని విద్యార్థులు కర్రలతో పరస్పరం దాడిచేసుకున్నారు. దీంతో జేఎన్టీయూ రణరంగాన్ని తలపించింది. ఈ ఘటనతో మిగతా విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. గాయపడిన విద్యార్థులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. హాస్టల్ సిబ్బంది ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడకు చేరుకుని విద్యార్థులను నిలువరించారు. విషయం తెలుసుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు.. హుటాహుటిన అక్కడకు చేరుకుని పరిస్థితి అదుపు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. హాస్టల్‌లో తీజ్ కార్యక్రమం సందర్భంగా రెండు వర్గాల మధ్య వివాదం మొదలైంది. దీంతో మాటా మాటా పెరిగి.. ఘర్షణగా మారింది. ఈ ఘటనపై వర్సిటీ యాజమాన్యం విచారణకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ అధికారులను విద్యార్థులు కోరుతున్నారు. బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మొలకల పండుగ తీజ్. ప్రకృతి ఆరాధన వేడుకల్లో అవివాహిత యువతులదే ప్రధాన పాత్ర. ప్రత్యేక ఉపవాసాలు పాటిస్తూ గోధుమలు, పుట్టమట్టితో వస్త్రంలో గోధుమలను విత్తుతారు. తొమ్మిది రోజుల పాటు మూడు పూటలా నీరు పోసి మొలకలు పెంచుతారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు అభివృద్ధి చెందాలని కోరుకుంటూ సంత్ సేవాలాల్ మహారాజ్, ఇతర దేవతలను ప్రార్థిస్తారు. భజనలు, ఆటపాటలతో తండాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది.

# నేను ఎక్కడికీ వెళ్లడం లేదు

- మాజీ మంత్రి కొండా సురేఖ
- కాంగ్రెస్‌ను వీడేది లేదని ప్రకటన
- బీజేపీ.. కొత్త పార్టీ ప్రచారాన్ని తోసిపుచ్చిన సురేఖ
- సోషల్ మీడియా పోస్టులతో సంబంధం లేదని స్పష్టీకరణ
- కేసీఆర్‌పై సురేఖ ప్రశంసలు!



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** మంత్రివర్గం నుంచి తొలగింపు తర్వాత కొండా సురేఖ చుట్టూ రాజకీయ ప్రచారం మరింత వేడెక్కుతోంది. ఒకవైపు తన పేరుతో సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పోస్టులతో తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని ఆమె స్పష్టం చేస్తుండగా.. మరోవైపు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై ప్రశంసలు కురిపించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. అయితే తాను, తన భర్త కొండా మురళి కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని సురేఖ తేల్చిచెప్పారు. "త్వరలో బిగ్ అప్‌డేట్", "నిరీక్షణకు తెరపడనుంది" అంటూ తన పేరుతో సామాజిక మాధ్యమాల్లో కొన్ని పోస్టులు చక్కర్లు కొడుతున్నాయని సురేఖ పేర్కొన్నారు. వాటితో తనకు గానీ, తన కుటుంబానికి గానీ ఎలాంటి సంబంధం లేదని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. అలాంటి పోస్టులను ఎవరూ నమ్మవద్దని కోరుతూ తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాల వివరాలను వెల్లడించారు. మంత్రివర్గం నుంచి తొలగించిన తర్వాతే ఈ తరహా పోస్టులు విస్తృతంగా ప్రచారంలోకి రావడంతో సురేఖ స్పందించారు. బీజేపీలో చేరబోతున్నారని, కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నారని జరుగుతున్న ప్రచారాన్నీ ఆమె తోసిపుచ్చారు. "నేను ఎక్కడికీ వెళ్లడం లేదు" అంటూ కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. మంత్రివర్గం నుంచి తనను తొలగించిన తీరుపై మాత్రం సురేఖ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానంపై సీఎం రేవంత్‌రెడ్డి ఒత్తిడి తీసుకొచ్చి తనను మంత్రి పదవి నుంచి తొలగించారని ఆమె ఆరోపించారు. ఈ పరిణామాల వెనుక మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి పాత్ర ఉందని కూడా విమర్శించారు. అంతకుముందు సురేఖ కుమార్తె సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. పరకాల రాజకీయాలపైనా ఆమె చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేయగా.. ఆమె ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందని క్రమశిక్షణ సంఘం చర్యలకు సిఫార్సు చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఇదే సమయంలో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసీఆర్‌పై సురేఖ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ఆసక్తి రేపుతున్నాయి. గతంలో బీఆర్‌ఎస్‌లో పనిచేసిన అనుభవాలను గుర్తుచేసుకున్న ఆమె.. "కేసీఆర్ చాలా మంచి వ్యక్తి. మేం ఎప్పుడు కలిసినా ఎంతో గౌరవంగా, హుందాగా రిసీవ్ చేసుకునేవారు" అని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్‌లో ఉన్నంతకాలం కేసీఆర్‌తో తమకు ఎలాంటి విభేదాలు రాలేదని చెప్పారు. తమ కుటుంబం కోరినప్పుడు కొండా మురళికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారని గుర్తుచేశారు. అప్పట్లో మురళికి ఎమ్మెల్సీ పదవి దక్కకుండా కొందరు సీనియర్ నేతలు ప్రయత్నించినప్పటికీ కేసీఆర్ స్వయంగా జోక్యం చేసుకుని ఆయన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించారని సురేఖ పేర్కొన్నారు.

ఒకవైపు కాంగ్రెస్‌ను వీడబోనని సురేఖ స్పష్టంగా చెబుతుండటం.. మరోవైపు కేసీఆర్ వ్యక్తిత్వం, గతంలో ఆయన తమ కుటుంబానికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని ప్రశంసించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. దీంతో కొండా దంపతుల భవిష్యత్ రాజకీయ అడుగులపై ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే కేసీఆర్‌పై చేసిన ప్రశంసలను బీఆర్‌ఎస్‌లో చేరేందుకు సంకేతంగా భావించడానికి ప్రస్తుతం ఎలాంటి అధికారిక ఆధారం లేదు. సురేఖ స్వయంగా కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేసిన నేపథ్యంలో పార్టీ మార్పుపై జరుగుతున్న ప్రచారం ప్రస్తుతానికి ఊహాగానాలకే పరిమితమైంది.

# కొత్తగా 2.50 లక్షల 'చేయూత' పింఛన్లు

- దరఖాస్తులకు ఈ నెల 15 వరకు అవకాశం
- పత్రాలు లేకున్నా ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఛాన్స్
- పరిశీలన సమయంలో ధ్రువపత్రాలు తప్పనిసరి
- పింఛన్ ఆగిపోయిన వారూ మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు
- ఇప్పటికే 4.34 లక్షల దరఖాస్తులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** తెలంగాణలో కొత్తగా 2.50 లక్షల మందికి 'చేయూత' సామాజిక పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. అర్హులు ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసే సమయంలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోయినా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు. అయితే దరఖాస్తుల పరిశీలన సమయంలో మాత్రం సంబంధిత ధ్రువపత్రాలను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. గీత కార్మికులు ఆబ్కారీ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరణ పత్రం లేకున్నా ఆధార్, రేషన్‌కార్డుతో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఒంటరి మహిళలకు తహసీల్దార్ ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులకు సదరం లేదా యూడీఐడీ, చేనేత కార్మికులకు సంబంధిత శాఖ సహాయ సంచాలకుడి ధ్రువీకరణ పత్రం అవసరమని అధికారులు పేర్కొన్నారు. దరఖాస్తు సమయంలో ఇవి లేకున్నా నమోదు చేసుకోవచ్చని, క్షేత్రస్థాయి పరిశీలన సమయంలో మాత్రం సమర్పించాలని సూచించారు. గతంలో పింఛన్ పొందుతూ వివిధ కారణాలతో ఆగిపోయిన వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అర్హతకు సంబంధించిన పత్రాలను పరిశీలన సమయంలో సమర్పించాల్సి ఉంటుంది. వాస్తవానికి కొత్త పింఛన్ల దరఖాస్తుల గడువు జులై 31తో ముగిసింది. అయితే ఇంకా చాలామంది అర్హులు దరఖాస్తు చేసుకోలేదన్న విజ్ఞప్తుల నేపథ్యంలో ప్రభుత్వం గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగించింది. చేయూత పథకం కింద ఐదు కేటగిరీల్లో కొత్త సామాజిక పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. కొత్త పింఛన్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. ఆగస్టు 30 నాటికి మొత్తం 4.34 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు సమాచారం. వీరిలో అత్యధికంగా 2.64 లక్షల దరఖాస్తులు వితంతువుల నుంచి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. గడువు పొడిగించడంతో మరో 50 వేలకుపైగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో సంబంధిత సిబ్బంది క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తించనున్నారు. కొత్తగా 2.50 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అర్హుల ఎంపికపై దరఖాస్తుదారుల్లో ఆసక్తి నెలకొంది.

# దమ్ముంటే నాపై నీ భార్యను పోటీ చేయించు!

- హరీశ్‌రావుకు కవిత ఓపెన్ ఛాలెంజ్
- 'మీ ఇద్దరిలో ఎవరు వచ్చినా ఎదుర్కొంటా'
- సిద్దిపేట నుంచి బరిలోకి దిగుతానని పునరుద్ఘాటన
- 'తెలంగాణకు సీఎం కావాలన్నదే నా ఆకాంక్ష'
- రేవంత్ పాలనపైనా ఘాటు విమర్శలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావును లక్ష్యంగా చేసుకుని నేరుగా ఎన్నికల సవాల్ విసిరారు. "దమ్ముంటే నాపై మీ భార్యను పోటీ చేయించండి. హరీశ్‌రావు వచ్చినా.. ఆయన భార్య వచ్చినా ఎదుర్కొనేందుకు నేను సిద్ధం" అంటూ ప్రకటించారు. గతంలో సిద్దిపేటలో హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన మాటకు తాను ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో హరీశ్‌రావును లక్ష్యంగా చేసుకుని వరుసగా విమర్శలు చేస్తున్న కవిత.. తాజాగా ఆయన కుటుంబాన్ని కూడా ప్రస్తావిస్తూ రాజకీయ సవాల్ విసిరారు. హరీశ్‌రావు కావాలంటే రాజకీయాల నుంచి పక్కకు తప్పుకుని తన భార్యను బరిలోకి దింపవచ్చని వ్యాఖ్యానించారు. "ఎవరు పోటీ చేసినా నాకు అభ్యంతరం లేదు. ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నా" అని తేల్చిచెప్పారు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేట నుంచి హరీశ్‌రావుపై పోటీ చేస్తానని గతంలో తాను చేసిన ప్రకటన వాస్తవమేనని కవిత గుర్తుచేశారు. తాజాగా చేసిన వ్యాఖ్యలతో సిద్దిపేటతో పాటు బోధన్ నియోజకవర్గంపైనా ఆమె దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఎక్కడి నుంచి పోటీ చేస్తారనే విషయంపై ఆమె స్పష్టమైన ప్రకటన చేయలేదు. హరీశ్‌రావుతో కవితకు ఏర్పడిన రాజకీయ విభేదాలు ఇటీవలి కాలంలో బహిరంగంగానే కనిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్‌ను దెబ్బతీసేందుకు హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారని, పార్టీలో పట్టు సాధించేందుకు చూస్తున్నారని గతంలో కవిత ఆరోపించారు. హరీశ్‌రావుపై అవినీతి సహా పలు తీవ్ర ఆరోపణలు కూడా చేశారు. అయితే అవన్నీ కవిత చేసిన రాజకీయ ఆరోపణలే తప్ప నిర్ధారిత అంశాలుగా పరిగణించలేం. తన భవిష్యత్ రాజకీయ లక్ష్యంపైనా కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు ముఖ్యమంత్రి కావాలన్న ఆకాంక్ష తనకు ఉందని వెల్లడించారు. దీంతో రాబోయే రోజుల్లో తన రాజకీయ కార్యాచరణను మరింత విస్తృతం చేసుకునే దిశగా ఆమె అడుగులు వేస్తున్నారనే చర్చ మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపైనా కవిత విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ నిర్ణయాలకు, ముఖ్యమంత్రి ప్రకటనలకు మధ్య పొంతన ఉండటం లేదని ఆరోపించారు. "ఇకపై తుగ్లక్ చర్యలు అని చెప్పాల్సిన అవసరం లేదు.. రేవంత్‌రెడ్డిలా ఉన్నావంటే సరిపోతుంది" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హరీశ్‌రావుపై కవిత వరుస విమర్శలు, ఇప్పుడు ఆయన భార్యను సైతం ప్రస్తావిస్తూ విసిరిన ఎన్నికల సవాల్ తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. హరీశ్‌రావును నేరుగా రాజకీయ ప్రత్యర్థిగా నిలబెట్టుకోవడం ద్వారా తనకంటూ ప్రత్యేక రాజకీయ స్థానం ఏర్పరచుకునే ప్రయత్నంలో కవిత ఉన్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మొత్తంగా "హరీశ్‌రావైనా.. ఆయన కుటుంబం నుంచి మరెవరైనా.. ఎన్నికల బరిలో ఎదుర్కొనేందుకు సిద్ధం" అన్న సంకేతాన్ని కవిత తన తాజా వ్యాఖ్యల ద్వారా ఇచ్చారు. దీంతో కవిత--హరీశ్‌రావు మధ్య సాగుతున్న రాజకీయ పోరు రాబోయే రోజుల్లో మరింత ముదిరే సూచనలు కనిపిస్తున్నాయి.

# అసెంబ్లీ పోరుకు బీఆర్‌ఎస్ వ్యూహం

- రేపు ఎర్రవల్లిలో శాసనసభాపక్ష భేటీ
- కేసీఆర్ అధ్యక్షతన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశం
- ప్రజా సమస్యలపై సర్కారును నిలదీసేందుకు కార్యాచరణ
- పార్టీ ప్రజాప్రతినిధులకు కేసీఆర్ దిశానిర్దేశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** రాష్ట్ర శాసనసభ సమావేశాలు సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ అసెంబ్లీ పోరుకు సిద్ధమవుతోంది. సభలో అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేసేందుకు ఈ నెల 6న బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసంలో ఈ సమావేశం జరగనుంది. మధ్యాహ్నం ఒంటి గంటకు భోజనం అనంతరం 2 గంటలకు కేసీఆర్ అధ్యక్షతన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సంయుక్త సమావేశం నిర్వహించనున్నారు. ఈ భేటీకి తప్పనిసరిగా హాజరుకావాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ సూచించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో అధికార పక్షాన్ని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. రాష్ట్రంలోని ప్రజా సమస్యలు, ప్రభుత్వ విధానాలు, హామీల అమలు తదితర అంశాలను సభలో ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీసే అంశాలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉంది. అసెంబ్లీలో ఏయే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి, ప్రభుత్వాన్ని ఏ అంశాలపై ప్రశ్నించాలి, పార్టీ సభ్యులు సభలో సమన్వయంతో ఎలా వ్యవహరించాలనే దానిపై కేసీఆర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేయనున్నారు. అసెంబ్లీ సమావేశాలకు ఒక్కరోజు ముందే జరుగుతున్న ఈ భేటీ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.



# కొండా సురేఖను తొలగించారు..

## పొంగులేటి సంగతి ఏమిటి?

## బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బందీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవమానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

# సురేఖను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం

- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- సురేఖకు బీఆర్‌ఎస్ తలుపులు బంద్
- రాజగోపాల్‌రెడ్డిపై జగదీశ్ ఫైర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** తెలంగాణ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ బీఆర్‌ఎస్‌లో చేరుతారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. సురేఖను బీఆర్‌ఎస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదని, ఆమెను ఆఖరికి తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వబోమని స్పష్టం చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, పార్టీని వీడి కాంగ్రెస్‌లోకి వెళ్లిన నేతలను తిరిగి చేర్చుకునేది లేదని, విమర్శలు చేసిన వారికి తలుపులు మూసుకుపోయాయని తేల్చిచెప్పారు. అదే సమయంలో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారంటూ సంచలన ప్రకటన చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నా బీఆర్‌ఎస్‌లోకి తీసుకోమని, ఆయనకు మంత్రి పదవి ఇస్తే ప్రభుత్వం డబ్బులకు అమ్ముడుపోయినట్లేనని విమర్శించారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన అవినీతి ఆరోపణలపై తక్షణమే విచారణ జరిపించాలని జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. తప్పులు చేసినందుకు బర్తరఫ్ చేయాల్సింది కొండా సురేఖను కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సీఎం పదవి నుంచి తొలగించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, కుంభకోణాలకు పాల్పడుతోందని, సంబంధిత వివరాలను కేంద్ర దర్యాప్తు సంస్థలకు పంపించామని తెలిపారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల కుంభకోణాన్ని ఎండగట్టేందుకు బీఆర్‌ఎస్ పక్కా వ్యూహంతో ఉందన్నారు. పార్టీలు మారిన ఎమ్మెల్యేల వ్యవహారంపై అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ నిజాయితీగా విచారణ జరిపించాలని ఆయన కోరారు.

## సంపాదకీయం



# ఏఐ నిపుణులకు భారీ డిమాండ్

### వేతనాల్లో 23 శాతం వృద్ధి!

**సీనియర్లకు రూ.89 లక్షలకుపైగా వార్షిక ప్యాకేజీ**

**అత్యధిక వేతనాల మార్కెట్‌గా బెంగళూరు**

**గట్టి పోటీదారుగా దూసుకొస్తున్న హైదరాబాద్**

కృత్రిమ మేధకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. వ్యాపార సంస్థల నుంచి సాంకేతిక కంపెనీల వరకు ఏఐ వినియోగం విస్తరిస్తుండటంతో ఆ రంగంలో నైపుణ్యం ఉన్న ఉద్యోగులకు డిమాండ్‌తో పాటు వేతనాలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. 2024-2026 మధ్య భారత్‌లో ఏఐ సంబంధిత ఉద్యోగాల వేతనాలు 23 శాతం పెరిగినట్లు ఉద్యోగాల వేదిక ఫౌండిట్ తాజా నివేదిక వెల్లడించింది. మరోవైపు కొన్ని సంప్రదాయ సాంకేతిక ఉద్యోగాల్లో వేతనాలు తగ్గడం లేదా స్తంభించిపోవడంతో ఉద్యోగ మార్కెట్‌లో వేతన వ్యత్యాసం మరింత స్పష్టమవుతోంది. గత ఏడాది ఏఐ రంగంలో వార్షిక ప్రాతిపదికన వేతనాలు 12 శాతం పెరిగాయని నివేదిక తెలిపింది. పరిశీలించిన రంగాల్లో ఇదే అత్యధిక వృద్ధి. కంప్యూటర్, నెట్‌వర్క్ సెక్యూరిటీ, సెమీకండక్టర్ రంగాలు చెరో 9 శాతం వృద్ధితో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మరోవైపు కంప్యూటర్ హార్డ్‌వేర్, ఈ--కామర్స్ రంగాల్లో గత రెండేళ్లుగా వేతనాలు తగ్గుముఖం పట్టగా.. ఐటీ సేవల రంగంలో పెద్దగా వృద్ధి కనిపించలేదని పేర్కొంది.

#### ఏఐలో రూ.89 లక్షల వరకు ప్యాకేజీ

ఏఐ రంగంలోకి కొత్తగా అడుగుపెడుతున్న వారికీ ఆకర్షణీయమైన వేతనాలు లభిస్తున్నాయి. సున్నా నుంచి మూడేళ్ల అనుభవం ఉన్న నిపుణులకు ఏటా రూ.8.87 లక్షల నుంచి రూ.15.41 లక్షల వరకు వేతనాలు లభిస్తుండగా.. 15 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న వారికి రూ.70.99 లక్షల నుంచి రూ.89.24 లక్షల వరకు అందుతున్నట్లు నివేదిక వెల్లడించింది. అయితే ప్రాంతాలను బట్టి వేతనాల్లో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఉత్పత్తి సంస్థలు, ఏఐ ఆధారిత అంకుర సంస్థలు, ప్రపంచ సామర్థ్య కేంద్రాలు ఎక్కువగా ఉండటంతో బెంగళూరు దేశంలో అత్యధిక వేతనాలు అందించే మార్కెట్‌గా కొనసాగుతోంది. అక్కడ సీనియర్ ఏఐ నిపుణులు ఏటా రూ.61.70 లక్షల నుంచి రూ.91.25 లక్షల వరకు పొందుతున్నట్లు నివేదిక పేర్కొంది. ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం, ముంబైతో పోలిస్తే ఇది దాదాపు 10 నుంచి 15 శాతం అధికం. సీనియర్ స్థాయిలో చెన్నైతో పోలిస్తే 40 శాతం వరకు ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది.

#### బెంగళూరుకు హైదరాబాద్ గట్టి పోటీ

ఏఐ ఉద్యోగాల విషయంలో హైదరాబాద్ కూడా వేగంగా దూసుకొస్తోంది. నగరంలో ప్రపంచ సామర్థ్య కేంద్రాల విస్తరణ, ఉత్పత్తి ఇంజినీరింగ్, సాంకేతిక రంగాల్లో పెరుగుతున్న పెట్టుబడులతో ఏఐ నిపుణులకు అవకాశాలు విస్తరిస్తున్నాయి. దీంతో అత్యధిక వేతనాల మార్కెట్‌గా ఉన్న బెంగళూరుకు హైదరాబాద్ గట్టి పోటీదారుగా ఎదుగుతోందని నివేదిక పేర్కొంది. సైబర్ సెక్యూరిటీ రంగంలో అత్యధిక వార్షిక వేతన పరిమితి రూ.97.81 లక్షలకు చేరింది. పరిశీలించిన విభాగాలన్నింటిలో ఇదే అత్యధికమని తెలిపింది. ఐటీ సేవల రంగంలో మాత్రం ప్రారంభ వేతనాలు రూ.2.68 లక్షల నుంచి రూ.5.08 లక్షల మధ్య ఉండగా.. 15 ఏళ్లకు పైగా అనుభవం ఉన్నవారికి రూ.57.55 లక్షల నుంచి రూ.72.13 లక్షల వరకు ఉన్నట్లు పేర్కొంది. గత ఏడాదితో పోలిస్తే ఈ విభాగంలో వేతనాలు ఒక శాతం తగ్గినట్లు నివేదిక వెల్లడించింది. ఉద్యోగుల అనుభవం కంటే సంస్థలకు అవసరమైన ప్రత్యేక నైపుణ్యాలకే ఇప్పుడు అధిక విలువ లభిస్తోందని ఫౌండిట్ సీఈఓ తరుణ్ సిన్హా పేర్కొన్నారు. ఏఐ వ్యవస్థల నిర్మాణం, సాంకేతిక మౌలిక సదుపాయాల భద్రత, పరిశ్రమల ఆటోమేషన్, ప్రత్యేక ఆరోగ్య సేవలు వంటి రంగాల్లో నైపుణ్యం ఉన్నవారికి సంస్థలు అధిక వేతనాలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. వ్యాపార అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకునే వారి వేతనాలు మరింత పెరిగే అవకాశముందని అభిప్రాయపడ్డారు. ఏఐతో పాటు ఇతర నూతన సాంకేతిక రంగాల్లోనూ వేతనాలు పెరుగుతున్నాయి. గత రెండేళ్లలో సెమీకండక్టర్ రంగంలో వేతనాలు 17 శాతం, పారిశ్రామిక ఆటోమేషన్‌లో 13 శాతం పెరిగినట్లు నివేదిక పేర్కొంది. పారిశ్రామిక ఆటోమేషన్‌లో సీనియర్ ఉద్యోగుల వార్షిక ప్యాకేజీ రూ.58.90 లక్షలకు, సెమీకండక్టర్ రంగంలో రూ.48.49 లక్షలకు చేరింది. ఆటోమొబైల్ రంగంలో గత ఏడాది 6 శాతం వేతన వృద్ధి నమోదైంది. వైద్య సేవల రంగంలో 8 శాతం పెరుగుదలతో సీనియర్ వేతనాలు రూ.56.70 లక్షలకు చేరాయి. వైద్య పరికరాల రంగంలో 6 శాతం, ఔషధ రంగంలో 4 శాతం వృద్ధి నమోదైంది. మొత్తంగా ఉద్యోగ మార్కెట్‌లో 'అనుభవం ఎంత?' అన్న ప్రశ్న కంటే 'నైపుణ్యం ఏమిటి?' అన్నదే కీలకంగా మారుతోంది. ఏఐ వినియోగం ఇదే వేగంతో విస్తరిస్తే.. ఆ రంగంలో నిరంతరం కొత్త నైపుణ్యాలను అందిపుచ్చుకునే నిపుణులకు అవకాశాలు, ఆదాయంలో తిరుగుండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# నింగిలోకి ఈవోఎస్-05

- ఇస్రో ఖాతాలో మరో భారీ విజయం!
- శ్రీహరికోట నుంచి ప్రయోగం
- భూస్థిర కక్ష్యలో పనిచేయనున్న ఇమేజింగ్ శాటిలైట్
- భారత ఉపఖండంపై నిరంతర పర్యవేక్షణ
- విపత్తులు.. వ్యవసాయం.. జలవనరులపై కీలక సమాచారం
- ఐదేళ్ల క్రితం విఫలమైన మిషన్‌కు ప్రత్యామ్నాయం

**శ్రీహరికోట, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో మరో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ద్వారా ఈవోఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. భూస్థిర కక్ష్య నుంచి పనిచేసే భారత ఇమేజింగ్ ఉపగ్రహంగా ఇది కీలక పాత్ర పోషించనుంది. భూమికి దాదాపు 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్యలో ఈ ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టనున్నారు. భూమి భ్రమణానికి అనుగుణంగా ప్రయాణిస్తూ భారత ఉపఖండం, పరిసర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించే సామర్థ్యం దీనికి ఉంటుంది. తక్కువ ఎత్తులోని కక్ష్యల్లో తిరిగే ఉపగ్రహాలతో పోలిస్తే ఒకే ప్రాంతాన్ని తరచూ పరిశీలించే అవకాశం ఈవోఎస్-05కు ఉండటం ప్రధాన ప్రత్యేకత.

#### ప్రతి అరగంటకోసారి భారత్ చిత్రం

ఈవోఎస్-05 ప్రతి 30 నిమిషాలకు భారత భూభాగాన్ని చిత్రీకరించే సామర్థ్యంతో రూపొందించినట్లు పేర్కొన్నారు. తుఫానులు, వరదలు, అడవి కార్చిచ్చులు వంటి ప్రకృతి విపత్తులను పర్యవేక్షించడంతో పాటు వాతావరణ మార్పులను గమనించేందుకు ఇది ఉపయోగపడనుంది. వ్యవసాయం, జలవనరుల నిర్వహణ, విపత్తు నిర్వహణతో పాటు వ్యూహాత్మక అవసరాలకు కూడా ఈ ఉపగ్రహ సమాచారం కీలకం కానుంది.

#### 2021 వైఫల్యానికి విజయంతో సమాధానం

ఇలాంటి లక్ష్యాలతోనే 2021 ఆగస్టులో జీఎస్ఎల్వీ-ఎఫ్10 ద్వారా ఈవోఎస్-03 ఉపగ్రహాన్ని ప్రయోగించగా సాంకేతిక సమస్య కారణంగా ఆ మిషన్ విజయవంతం కాలేదు. ఆ తర్వాత చేపట్టిన తాజా మిషన్ విజయవంతం కావడంతో ఇస్రో కీలక మైలురాయిని అందుకుంది. ప్రస్తుతం ఈవోఎస్-05ను భూస్థిర బదిలీ కక్ష్యలో ప్రవేశపెట్టినట్లు ఇస్రో తెలిపింది. ఉపగ్రహంలోని సౌర ఫలకాలు తెరుచుకుని పనిచేస్తున్నాయని పేర్కొంది. రానున్న రోజుల్లో దశలవారీగా కక్ష్యను పెంచుతూ తుది భూస్థిర కక్ష్యలోకి తీసుకెళ్లనున్నారు. భూమిపై విపత్తుల పర్యవేక్షణ నుంచి వ్యవసాయం, జలవనరుల నిర్వహణ వరకు అనేక రంగాలకు ఉపయోగపడే ఈవోఎస్-05 ప్రయోగంతో భారత భూపరిశీలన సామర్థ్యం మరింత బలోపేతం కానుంది.



### భారత అంతరిక్ష సామర్థ్యాలపై విదేశాంగ శాఖ హర్షం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడం పట్ల కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) హర్షం వ్యక్తం చేసింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించిన ఈ రాకెట్, దేశంలోనే తొలి జియోసింక్రోనస్ ఇమేజింగ్ శాటిలైట్ అయిన 'ఈవోఎస్-05' (ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్-05)ను కచ్చితత్వంతో నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఈ చరిత్రాత్మక విజయం భారత్‌కు ఎంతో గర్వకారణమైన క్షణమని ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ కొనియాడారు. ఇస్రో సాంకేతిక సామర్థ్యాలతో పాటు భారతీయ పరిశ్రమలతో పెరుగుతున్న భాగస్వామ్యానికి ఈ విజయం నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. తొలి జియో-ఇమేజింగ్ ఉపగ్రహం ప్రయోగం సక్సెస్ కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

# ట్రంప్ దృష్టిలో అగ్రస్థానంలో మోదీ

### అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:** జీ20 సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వెళ్లనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతగానో కోరుకుంటున్నారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. డిసెంబర్‌లో ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు కేవలం బహుపాక్షిక సమావేశాలకే పరిమితం కాకపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ దృష్టిలో మోదీ స్నేహితుడని, 35 మంది నేతలు వస్తే ఎవరిని కలవాలనుకుంటారని అడిగితే.. మోదీ ఆయన జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని గోర్ చెప్పారు. 2020లో భారత పర్యటనను ట్రంప్ ఇప్పటికీ ఎంతో ఇష్టంగా గుర్తుచేసుకుంటున్నారని, వచ్చే ఏడాది ఆయన భారత్‌కు వచ్చే అవకాశం కూడా ఉందని సంకేతాలు ఇచ్చారు. అమెరికా-భారత్ సంబంధాలు ఇతర దేశాలు అసూయపడే రీతిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కూడా గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు తర్వాత చర్చలను మళ్లీ కొనసాగిస్తున్నామని, ఒప్పందం "చాలా దగ్గర్లోనే ఉంది" అని తెలిపారు. రాబోయే కొన్ని నెలల్లో ఒప్పందం ఖరారవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 240 బిలియన్ డాలర్లు ఉండగా.. దీన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని మోదీ, ట్రంప్ లక్ష్యంగా పెట్టుకున్నారు. భారత్ ఆర్థికంగా బలపడటం అమెరికాకు కూడా ప్రయోజనకరమని గోర్ అన్నారు. మోదీ దేశానికి స్థిరత్వాన్ని అందిస్తున్నారని ప్రశంసించారు. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెంచుతున్నాయని, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్లు, ఏఐ కేంద్రాలు, ఔషధ రంగాల్లో విస్తరిస్తున్నాయని చెప్పారు. అమెరికాలోకి కొత్తగా 24 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడంలోనూ రాయబార కార్యాలయం సహకరించిందన్నారు. భారత్ తమకు విశ్వసనీయమైన రక్షణ భాగస్వామి అని గోర్ పేర్కొన్నారు. రక్షణ సంబంధాలు కేవలం ఆయుధాల కొనుగోళ్లకే పరిమితం కావని, పరస్పర విశ్వాసం కూడా కీలకమని చెప్పారు. జావెలిన్ క్షిపణి ప్రాజెక్టు, అపాచీ హెలికాప్టర్ల సరఫరా, మరిన్ని రక్షణ పరికరాలపై చర్చలను ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. అమెరికాతో భారత్ ఇతర దేశాల కంటే ఎక్కువగా సైనిక విన్యాసాలు నిర్వహిస్తోందన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అక్టోబర్‌లో మరోసారి భారత్‌కు రానున్నారు. తక్కువ వ్యవధిలో విదేశాంగ మంత్రి రెండుసార్లు భారత్‌కు రావడం అరుదని గోర్ అన్నారు. మరికొందరు అమెరికా కేబినెట్ మంత్రులు, మూడు రాష్ట్రాల గవర్నర్లు కూడా ఈ ఏడాది భారత్‌లో పర్యటించే అవకాశం ఉందన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా వచ్చే నాలుగు నెలల్లో మూడుసార్లు అమెరికా వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కూడిన క్వాడ్ కూడా ఇరు దేశాల భాగస్వామ్యంలో కీలకమని గోర్ అన్నారు. మానవతా సాయం, విపత్తుల నిర్వహణ, సైనిక సహకారం, కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, కీలక ఖనిజాల రంగాల్లో నాలుగు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. త్వరలో నాలుగు దేశాల నేతల శిఖరాగ్ర సమావేశం నిర్వహించేందుకు అమెరికా ఆసక్తిగా ఉందన్నారు.



# మహిళపై లైంగిక దాడి యత్నం.. అడ్డుకున్న వీధికుక్క!

### కోయంబత్తూరులో వెలుగులోకి వచ్చిన ఘటన

### మహిళ కేకలకు స్పందించిన శునకం

**కోయంబత్తూరు, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** మానసిక సమస్యలతో బాధపడుతున్న ఓ మహిళపై 17 ఏళ్ల బాలుడు లైంగిక దాడికి యత్నించగా.. సమీపంలో ఉన్న వీధికుక్క అడ్డుకుని ఆమెను కాపాడిన ఘటన తమిళనాడులోని కోయంబత్తూరులో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో నమోదవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారగా.. మహిళను రక్షించిన శునకంపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. కోయంబత్తూరు సమీపంలోని తుడియలూరు రైల్వే ఓవర్‌బ్రిడ్జి సర్వీస్ రోడ్డులో గురువారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. రోడ్డు పక్కన ఓ మహిళ వీధికుక్క సమీపంలో కూర్చుని ఉండగా.. మద్యం మత్తులో ఉన్నట్లు చెబుతున్న 17 ఏళ్ల బాలుడు అక్కడికి వచ్చాడు. తొలుత కుక్కను అక్కడి నుంచి తరిమేందుకు ప్రయత్నించిన బాలుడు అనంతరం మహిళపై లైంగిక దాడికి యత్నించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఆ సమయంలో మహిళ గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న వీధికుక్క వెంటనే స్పందించింది. బాలుడిపైకి దూసుకెళ్లి అతని కాళ్లను కరిచింది. దీంతో భయపడిన బాలుడు అక్కడి నుంచి పరుగులు తీయగా.. కుక్క కొంతదూరం వరకు తరిమినట్లు సీసీటీవీ దృశ్యాల్లో కనిపించింది. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టి అదే రోజు బాలుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం న్యాయస్థానం ముందు హాజరుపరచగా అబ్జర్వేషన్ హోంకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతోంది. సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్ కావడంతో మహిళను కాపాడిన వీధికుక్క చర్యపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రమాదాన్ని గుర్తించి వెంటనే స్పందించిన శునకం వల్లే మహిళ మరింత ప్రమాదం నుంచి బయటపడిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అదే సమయంలో మహిళల భద్రత, బలహీన వర్గాల రక్షణపై మరింత అప్రమత్తత అవసరమన్న చర్చ కూడా ఈ ఘటనతో మళ్లీ ముందుకొచ్చింది.


# ఢిల్లీని ముంచెత్తిన కుండపోత వర్షం

### జలదిగ్బంధంలో ఎయిర్‌పోర్ట్

### దేశ రాజధానిలో భారీ వర్షపాతం నమోదు

**ఢిల్లీ, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల మధ్యలో దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లైట్‌రాడార్24 డేటా ప్రకారం, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అత్యంత రద్దీగా





ఉండే ఈ విమానాశ్రయంలో రోజుకు 1,300కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమాన సర్వీసులపై ప్రభావం పడిందని ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు వేర్వేరుగా ప్రకటించాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నెమ్మదిగా ప్రయాణం సాగుతున్నందున, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని ఇండిగో కోరింది. ఎయిర్‌పోర్ట్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడిందని, తాజా సమాచారం కోసం ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం విజ్ఞప్తి (జీఎంఆర్) చేసింది. నీటిని తొలగించడానికి తమ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తీవ్ర వర్షపాతం నమోదవుతుందని హెచ్చరించింది. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# ఒక్క మహిళపై చర్య కాదు.. బీసీ ఆత్మగౌరవంపై దెబ్బ

- బీసీ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే.. తగిన మూల్యం తప్పదు
- కొండా సురేఖను బలిపశువు చేయడం దుర్మార్గం...బీసీ మహాసేన ఆగ్రహం
- తాటిశెట్టి క్రాంతి కుమార్, గొల్లపల్లి వీరస్వామి




**హనుమకొండ, సెప్టెంబర్ 04 (సమయం న్యూస్) :** బీసీ మహిళా నాయకురాలు, మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయడాన్ని తెలంగాణ బీసీ మహాసేన తీవ్రంగా ఖండించింది. ఒక బీసీ మహిళా మంత్రిని లక్ష్యంగా చేసుకుని చర్యలు తీసుకోవడం యావత్ బీసీ సమాజాన్ని అవమానించడమేనని మహాసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ బీసీ మహాసేన ఫౌండర్ చైర్మన్ తాటిశెట్టి క్రాంతి కుమార్, కన్వీనర్ గొల్లపల్లి వీరస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు చేశారు. గతంలో ఇతర సామాజిక వర్గాలకు చెందిన కొందరు నాయకులు ముఖ్యమంత్రినే లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు చేసినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు పేర్కొన్నారు. అదే సమయంలో బీసీ మహిళా నాయకురాలు కొండా సురేఖను మాత్రం బలిపశువును చేయడం ప్రభుత్వ పక్షపాత వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ కోసం కొండా సురేఖ కుటుంబం ఎన్నో సంవత్సరాలుగా చేసిన సేవలను పరిగణనలోకి తీసుకోకుండా ఆమెకు అవమానం కలిగేలా వ్యవహరించడం బాధాకరమన్నారు. కేవలం బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకురాలు కావడం వల్లే ఆమెపై వివక్ష చూపుతున్నారనే భావన బీసీ వర్గా ల్లో నెలకొందని అన్నారు. ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాలను సమానంగా చూడాలని, బీసీల పట్ల వివక్షపూరిత ధోరణిని విడనాడాలని వారు సూచించారు. ఇదే వైఖరి కొనసాగితే రాబోయే రోజుల్లో బీసీ సమాజం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ బీసీ మహాసేన ఫౌండర్ చైర్మన్ తాటిశెట్టి క్రాంతి కుమార్, కన్వీనర్ గొల్లపల్లి వీరస్వామి, రాసమల్ల శ్రీనివాస్, నలబాల రవికుమార్, జూకంటి రవీందర్, నలబోలా అమరేందర్, అనిశెట్టి సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

# కల్మషం లేని హృదయాల్లో.. కృష్ణుడి జన్మదిన వేడుకలు



- ఆనందాన్నిపంచడమే పండుగ.. 'స్పందన'లో కృష్ణాష్టమి వేడుకలు
- స్పందన ఆశ్రమంలో పిల్లలతో కలిసి ఉట్టి కొట్టిన డాక్టర్ అనితా రెడ్డి

**హనుమకొండ, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్) :** హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి పిల్లలతో కలిసి వేడుకల్లో పాల్గొ ని, వారితో ఆత్మీయంగా మమేకమయ్యారు.శ్రీకృష్ణుడు జన్మించిన పవిత్రమైన రోజును శ్రీకృష్ణాష్టమిగా జరుపుకుంటామని డాక్టర్ అనితా రెడ్డి తెలిపారు. ధర్మం, భక్తి, సత్యం మార్గంలో నడవాలని ఈ పర్వదినం మనకు గుర్తుచేస్తుందన్నారు. శ్రీకృష్ణుడి అనుగ్రహంతో ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, ధైర్యం, సంతోషం, ఆరోగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో భాగంగా కల్మషం ఎరుగని ఆశ్రమంలోని చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. ముందుగా చిన్నారులతో కలిసి డాక్టర్ అనితా రెడ్డి ఉట్టి కొట్టి వేడుకలను ప్రారంభించారు. అనంతరం చిన్నారులు నృత్యాలతో సందడి చేశారు. పిల్లలకు మిఠాయిలు పంపిణీ చేసి, వారితో ప్రేమగా మమేకమై శ్రీకృష్ణాష్టమి వేడుకలను జరుపుకున్నారు. పండుగ అంటే మనం మాత్రమే సంతోషంగా ఉండటం కాదు.. పదిమందిని ఆనందపరచడమే నిజమైన పండుగని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. మానసిక దివ్యాంగులైన చిన్నారులకు చేసే ప్రతి సేవ విశ్వమానవ సేవతో సమానమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు సుచరిత, ఆర్వికా రెడ్డి, వసుధ, హరిత, భార్గవి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

# అక్షరం నుంచి ఆదర్శం వరకు.. గురువే ప్రతీ అడుగులో..

- ఉపాధ్యాయులందరికీ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు... ఎంపీ వద్దిరాజు రవిచంద్ర
- పాఠం చెప్పే గురువు కాదు.. జీవితాన్ని నేర్పే మహనీయుడు



**వరంగల్, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్) :** విద్యార్థులకు విద్యాబోధనతో పాటు మంచి ఆలోచనలు, క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని నేర్పించే గురువులు సమాజానికి మార్గదర్శకులని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన దేశవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సుప్రసిద్ధ విద్యావేత్త, తత్వవేత్త, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని 1962 నుంచి సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీ తన సందేశంలో తెలిపారు. విద్యారంగానికి విశేష సేవలందించిన రాధాకృష్ణన్ ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేసిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందారని చెప్పారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, బనారస్ హిందూ విశ్వవిద్యాలయాలకు ఉపకులపతిగా సేవలందించడంతో పాటు సోవియట్ రష్యాలో భారత రాయబారిగా, దేశ ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా వివిధ బాధ్యతలు నిర్వర్తించారని రవిచంద్ర గుర్తుచేశారు. విద్యావేత్తగా, తత్వవేత్తగా, దేశాధ్యక్షుడిగా ఆయన అందించిన విశేష సేవలకు గుర్తింపుగా భారతరత్న పురస్కారం లభించిందన్నారు. రాధాకృష్ణన్ తెలుగు వ్యక్తి కావడం ప్రతి తెలుగువారికీ గర్వకారణమని పేర్కొన్నారు.

**గురువు.. సమాజానికి దిక్సూచి...**

"మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ" అనే భావన భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని ఎంపీ తెలిపారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల తర్వాత జీవితానికి దిశానిర్దేశం చేసే గురువులను సమాజం అత్యంత గౌరవంతో చూస్తుందని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర అమూల్యమని కొనియాడారు. 'దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుందని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పిన మాటలు నేటికీ స్ఫూర్తిదాయకమని రవిచంద్ర అన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు విలువలను బోధించి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని కోరారు.

# మద్దూరులో అభివృద్ధి పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి





**మద్దూరు మున్సిపల్,(మం) సెప్టెంబర్,04 (సమయం న్యూస్)**

నారాయణపేట జిల్లా/కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండల కేంద్రంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు.మద్దూరుకు చేరుకున్న ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ ప్రియాంక హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కళాశాల భవన నిర్మాణ నమూనా చిత్రపటాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి, భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం, నిర్మాణ విస్తీర్ణం, తరగతి గదులు, ప్రయోగశాలలు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 4 ఎకరాల స్థలంలోని 13,670 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నట్లు ఈడబ్ల్యూఐడీసీ ఎం.డీ. గణపతిరెడ్డి ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం భవనం లోపల జరుగుతున్న నిర్మాణ పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు.కళాశాల భవనం పక్కన ప్రధాన రహదారి వైపు ఉన్న అదనపు భూమిని సర్వే చేయించాలని, అది పట్టా భూమి అయితే కొనుగోలు చేసి కళాశాలకు విశాలమైన ప్రాంగణం, ప్రహరీ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రియాంకకు ముఖ్యమంత్రి సూచించారు. వచ్చే మార్చి నెలలోపు కళాశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మద్దూరు ప్రాంతంలో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

**గురుకుల బాలికల పాఠశాల నిర్మాణ పనుల పరిశీలన**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనుల పరిశీలన అనంతరం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి రోడ్డు మార్గంలో చింతల్ దిన్నె వైపు కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల నిర్మాణ పనులను కూడా పరిశీలించారు.నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో రాజీ ప్రతి పడవద్దని సూచించారు. పనులు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే బాధ్యులపై చర్యలు తప్పవని ముఖ్యమంత్రి హెచ్చరించారు. అయితే గురుకుల పాఠశాల నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి మద్దూరుకు చేరుకున్న సందర్భంగా పట్టణంలో అభిమానులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శ్రీధర్, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ్ కుమార్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్వో రాజేశ్వరి, మద్దూరు మున్సిపల్ చైర్ పర్సన్ సరస్వతీ, మద్దూరు మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నర్సిములు, వీరేశ్ గౌడ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీస్ సిబ్బందికి బ్రీఫింగ్





**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,04(సమయం న్యూస్)** తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ పరితోష్ పంకజ్, IPS మరియు జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, IPS పోలీస్ సిబ్బందికి బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, బందోబస్తు విధులు, ట్రాఫిక్ నియంత్రణ, వీఐపీ మూమెంట్, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి స్పష్టమైన సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ, తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులు ఆదేశించారు.ఇట్టి కార్యక్రమం లో పోలీస్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహానికి స్థలం కేటాయించాలి


- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి ప్రజా సంఘాల వినతి
- తెలంగాణ నేలపై మారుమోగిన గద్దర్ గళం.. హనుమకొండలో నిలువెత్తు జ్ఞాపకం



**హనుమకొండ, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్) :** ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహాన్ని హనుమకొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. గద్దర్ విగ్రహ స్థాపనకు సంబంధించి జిల్లా కలెక్టర్‌కు గతంలో సమర్పించిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే వెంటనే ఫార్వర్డ్ చేయడంపై ప్రజా సంఘాల నాయకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో గద్దర్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ రాష్ట్రవ్యాప్తంగా గద్దర్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని, పీడిత ప్రజల హక్కులు, విముక్తి కోసం ఆయన సాగించిన పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గద్దర్ విగ్రహ స్థాపన కమిటీ చైర్మన్ కోండ్ర నర్సింగరావు, బీసీ జాక్ నాయకుడు డాక్టర్ తిరునహరి శేషు, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, డీబీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, గజాల గోవర్ధన్, గద్దర్ సాంబయ్య, పి. రమేష్ తదితరులు పాల్గొ న్నారు.

# కుడా చైర్మన్‌గా సుధారాణి.. 'ఇనగాల' అభినందనలు

### డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన గుండు సుధారాణి



**హనుమకొండ, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్) :** వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ఛైర్మన్‌గా నియమితులైన గుండు సుధారాణి శుక్రవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ రామకృష్ణ కాలనీలోని ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి నివాసానికి వెళ్లి న ఆమె పుష్పగుచ్ఛం అందించి అభినందనలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇరువురు కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. కుడా ఛైర్మన్‌గా సుధారాణి నియామకంపై ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆమెకు శాలువా కప్పి సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. కుడా ఛైర్మన్‌గా కొత్త బాధ్యతలు చేపట్టనున్న గుండు సుధారాణికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ నగరంతో పాటు ఉమ్మడి వరంగల్ ప్రాంతంలో పట్టణాభివృద్ధికి కుడా కీలకమైన సంస్థగా పనిచేస్తున్న నేపథ్యంలో సుధారాణి నేతృత్వంలో సంస్థ మరింత సమర్థవంతంగా పనిచేసి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి, ప్రణాళికాబద్ధమైన నగర విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కుడా ఛైర్మన్‌గా తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి, పార్టీ నాయకత్వానికి సుధారాణి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ వరంగల్ నగరాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## కొడంగల్ నవీన ఆదర్శ స్కూల్ లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,04(సమయం న్యూస్)** వికారాబాద్ జిల్లా కొడంగల్ స్థానిక నవీన ఆదర్శ స్కూల్ లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు..చిన్నారులు రాధాకృష్ణ ,కృష్ణుని వేషధారణలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు అలాగే విద్యార్థులు శ్రీకృష్ణ వేషధారణ నృత్యాలు ఆకట్టుకున్నాయి ఇట్టి కార్యక్రమం ప్రిన్సిపల్ డి వి నరేష్ రాజ్ ,వైస్ ప్రిన్సిపాల్ సంతోష ఉపాధ్యాయ బృందం పాల్గొని ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు.

## శ్రీకృష్ణుడి సన్నిధిలో 'నాయిని' దంపతులు...

### భక్తిశ్రద్ధ లతో జన్మాష్ట మి..పలు ఆలయాల్లో ఎమ్మెల్యే నాయిని దంపతుల ప్రత్యేక పూజలు



**హనుమకొండ, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్) :** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఆయన సతీమణి నాయిని నీలిమ రాజేందర్‌రెడ్డి శుక్రవారం నియోజకవర్గంలోని పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలకు చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు ఆలయ ప్రతినిధులు, భక్తులు ఆత్మీయ స్వాగతం పలికారు. ములుగు రోడ్డులోని ప్రముఖ శ్రీకృష్ణ మందిరం (ఇస్కాన్)ను సందర్శించిన నాయిని దంపతులు శ్రీకృష్ణుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జన్మాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం వరంగల్‌లోని శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయానికి వెళ్లిన వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు పొందారు. సమీపంలోని శ్రీ షిరిడీ సాయినాథుని ఆలయాన్ని సందర్శించి సాయినాథుడికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి, సౌభ్రాతృత్వాన్ని నింపాలని ఆకాంక్షించారు. భగవంతుని కృపతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన పోలీస్ ఉన్నతాధికారులు





**కొడంగల్ నియోజకవర్గం,సెప్టెంబర్,04(సమయం న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా విచ్చేసిన సందర్భంగా చార్మినార్ జోన్ డీఐజీ చందన దీప్తి, IPS, వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ పరితోష్ పంకజ్, IPS, జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, IPS గార్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారికి పోలీస్ శాఖ తరపున మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీస్ శాఖ చేపట్టి న భద్రతా ఏర్పాట్లను ఉన్నతాధికారులు పర్యవేక్షించడం జరుగుతుంది.

## ఉమ్రిలో మండల స్థాయి కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 4: ( సమయం న్యూస్య)** వతను క్రీడల వైపు ప్రోత్సహించడమే పోలీసుల లక్ష్యమని ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా అన్నారు. తలమడుగు మండలం ఉమ్రి గ్రామంలో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను శుక్రవారం ఎస్ఐ డి.రాధికతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేత జట్లకు వరుసగా రూ.5,000, రూ.3,000, రూ.2,000 నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు అందజేయనున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పెద్దలు, యువత, క్రీడాకారులు పాల్గొన్నారు.

# కొత్త గూడెం లో 12న ముస్లిం ఐక్య సంఘం బహిరంగ సభ

**మౌలానా షేక్. ముజాహిద్**



**ఖమ్మం, సెప్టెంబర్ 4 : ( సమయం న్యూస్ )** ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఈ నెల 12 ( శనివారం ) వ తేదీన నిర్వహించనున్న జిల్లాస్థాయి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మౌలానా షేక్ ముజాహిద్ ఇషాతి పిలుపునిచ్చారు. అసెంబ్లీ నియోజక వర్గం అయిన మధిర జామియా మస్జిద్‌లో శుక్రవారం ముస్లిం ఐక్య సంఘం అధ్యక్షులు మౌలానా షేక్. ముజాహిద్ ఇషాఅతి ఆధ్వర్యంలో సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముస్లిం ఐక్య సంఘం ఆవిర్భావానికి మధిర గడ్డే పునాది అని, అందువల్ల కొత్తగూడెంలో జరుగుతున్న ఈ జిల్లాస్థాయి బహిరంగ సభతో మధిర నియోజకవర్గానికి ప్రత్యేకమైన అనుబంధం, బాధ్యత ఉన్నాయని పేర్కొన్నారు. మధిర నియోజక వర్గంలోని ప్రతి మండలం, ప్రతి గ్రామం, ప్రతి మస్జిద్ పరిధి నుంచి ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి. కుటుంబాలకు, యువతకు, పెద్దలకు సభ సందేశాన్ని చేరవేయాలి. కొత్తగూడెం గడ్డపై మధిర నియోజకవర్గ ముస్లిం సమాజ ఐక్యత, క్రమశిక్షణ, చైతన్యం స్పష్టంగా కనిపించాలి పిలుపునిచ్చారు. ముస్లిం సమాజం ఎదుర్కొంటున్న విద్యా, సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారం, యువత భవిష్యత్తు, సామాజిక చైతన్యం, సమాజ అభివృద్ధి, రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణ కోసం ఐక్యతే ప్రధాన బలం అని పేర్కొన్నారు. వ్యక్తిగత, గ్రామ, మండల భేదాలను పక్కనపెట్టి సమాజ ప్రయోజనాల కోసం ఒకే వేదికపై నిలబడాల్సిన సమయం వచ్చిందన్నారు. ఒక్కరి అడుగు చిన్నదిగా కనిపించవచ్చు; వేలాది మంది ఒకే లక్ష్యంతో ముందుకు నడిస్తే అది సమాజ శక్తిగా మారుతుంది. సెప్టెంబర్ 12న కొత్తగూడెం గడ్డపై మన ఐక్యతను, మన క్రమశిక్షణను, మన సామాజిక చైతన్యాన్ని చాటుదాం అని తెలిపారు. సభను విజయవంతం చేయడం ప్రతి ముస్లిం ఐక్య సంఘం నాయకుడు, కార్యకర్త, సభ్యుడు తన బాధ్యతగా తీసుకోవాలని కోరారు. గ్రామస్థాయి నుంచి విస్తృత ప్రచారం చేపట్టి, ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహించి, యువతను మరియు ముస్లిం సోదరులను సమీకరించి మధిర నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో పాల్గొనేలా కృషి చేయాలని సూచించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముస్లిం ఐక్య సంఘం నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మత పెద్దలు, యువకులు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# బంజారా ఆత్మగౌరవానికి ప్రతీక.. తీజ్ ఉత్సవాలు

- **తీజ్‌కు రాష్ట్ర పండుగ హోదా.. బీజేపీ అధికారంలోకి వస్తే గుర్తి ంపు... డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**
- **రంగురంగుల వస్త్రాలు.. సంప్రదాయ నృత్యాలు.. తీజ్‌లో బంజారా వైభవం**



**నర్సంపేట, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్) :** బంజారా తెగ ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ పండుగ వేడుకలు నర్సంపేటలో అంగరంగ వైభవంగా జరిగాయి. భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు బానోతు రమేష్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో బంజారా మహిళలు, యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమానికి మహబూబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై తీజ్ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజ్మీరా సీతారాం నాయక్ మాట్లాడుతూ తీజ్ పండుగ కేవలం వేడుక కాదని, బంజారా జాతి ఆత్మగౌరవం, సంస్కృతి, అస్తిత్వానికి ప్రతీకని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఇన్నాళ్లూ గిరిజనులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూశాయని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బంజారా సమాజం, గిరిజన సంస్కృతికి గుర్తింపు లభిస్తోందని, సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించడం అందుకు నిదర్శనమన్నారు. డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లా డుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు బీజేపీ ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. వరంగల్ జిల్లాలో ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో భారీ స్థాయిలో తీజ్ ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బానోతు రమేష్ నాయక్ వంటి యువ నాయకులు పార్టీకి బలమని, వారి నాయకత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే తీజ్ పండుగను అధికారిక రాష్ట్ర పండుగగా గుర్తించి ఘనంగా నిర్వహిస్తామని రాణా ప్రతాప్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు, ఎస్టీ మోర్చా, మహిళా మోర్చా నాయకులు, బంజారా పెద్దలు, మహిళలు, యువత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంప్రదాయ వేషధారణలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో తీజ్ వేడుకలు సందడిగా సాగాయి.

# రాష్ట్ర ముఖ్య మంత్రి ప్రారంభించనున్న ఆర్అండ్ గెస్ట్ హౌస్

- **ఒక్క గురువు వెలిగించే దీపం.. ఓ తరాన్నే వెలిగిస్తు ంది**
- **సైన్స్ ఉపాధ్యాయుడు ఓదెల చంద్రమౌళి**





**హనుమకొండ, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్) :** ఉపాధ్యాయుడు కేవలం పాఠ్యపుస్తకంలోని పాఠాలను బోధించే వ్యక్తి కాదు.. విద్యార్థి జీవితానికి దిశానిర్దేశం చేసే మార్గదర్శి, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శిల్పి, సమాజ భవిష్యత్తును నిర్మించే జాతి నిర్మాత అని సైన్స్ ఉపాధ్యాయుడు (ప్రజ్ఞ అకాడమీ) ఓదెల చంద్రమౌళి అన్నారు. భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని, "గురుర్ బ్రహ్మ.. గురుర్ విష్ణుః.. గురుర్దేవో మహేశ్వరః" అనే శ్లోకం గురువు గొప్పతనాన్ని ప్రతిబింబిస్తుందని వివరించారు. గురువు జ్ఞానాన్ని అందించడంతో పాటు అజ్ఞానమనే చీకటిని తొలగించి విద్యార్థిని మంచి పౌరుడిగా తీర్చిదిద్దే బాధ్యతను నిర్వర్తిస్తారని తెలిపారు. ప్రాచీన భారతదేశంలోని గురుకుల వ్యవస్థ, తక్షశిల, నలంద వంటి విద్యా కేంద్రాలు దేశ విద్యా వైభవాన్ని ప్రపంచానికి చాటాయని గుర్తుచేశారు. విద్యను వ్యాపార వస్తువుగా కాకుండా వ్యక్తి, సమాజ పరివర్తనకు శక్తివంతమైన సాధనంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, తప్పులను సరిదిద్ది, ఆత్మవిశ్వాసాన్ని పెంచి, సరైన మార్గంలో నడిపించడంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకమన్నారు. విద్యార్థి సాధించే విజయం గురువుకు లభించే అత్యున్నత పురస్కారమని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పరస్పరం గౌరవించుకోవడంతో పాటు తల్లిదండ్రులు–ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పిల్లల భవిష్యత్తుకు క్రమశిక్షణ, విలువలు, బాధ్యత బలమైన పునాదులుగా నిలుస్తాయని వివరించారు. కృత్రిమ మేధస్సు (AI) విద్యారంగంలో ఎన్నో అవకాశాలను అందిస్తున్నప్పటికీ, ఉపాధ్యాయుడి స్థానాన్ని పూర్తిగా భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. AI సమాచారాన్ని అందించగలదు.. గురువు ఆ సమాచారానికి అర్థాన్ని, విద్యార్థి జీవితానికి దిశను ఇస్తాడని అన్నారు. దేశ భవిష్యత్తు కేవలం సాంకేతికత, సంపదతో నిర్మితం కాదని, విలువలు, బాధ్యత, మానవత్వం కలిగిన పౌరుల ద్వారానే బలమైన సమాజం ఆవిర్భవిస్తుందని తెలిపారు. అలాంటి పౌరులను తీర్చిదిద్దే మహత్తర బాధ్యత ఉపాధ్యాయులదేనని చెప్పారు. మంచి గురువు మంచి విద్యార్థిని, మంచి విద్యార్థి మంచి కుటుంబాన్ని, మంచి కుటుంబం మంచి సమాజాన్ని, మంచి సమాజం బలమైన దేశాన్ని నిర్మిస్తుంది. అందుకే ఉపాధ్యాయుడిని గౌరవించడం అంటే దేశ భవిష్యత్తును గౌరవించడమేనని చంద్రమౌళి ఓదెల స్పష్టం చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తరతరాల భవిష్యత్తును నిశ్శబ్దంగా తీర్చిదిద్దుతున్న ప్రతి గురువుకూ హృదయపూర్వక వందనం తెలిపారు.

# నిన్నటి నిరీక్షణకు.. నేటి అభివృద్ధి సమాధానం..!

- **మార్పు వైపు యువత అడుగులు.. బీజేపీలో చేరికలు**
- **కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు షాక్.. బీజేపీలోకి యువ నాయకుల చేరిక**
- **డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్న యువత**



**నర్సంపేట, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్) :** పట్టణంలో బీజేపీకి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని ఆ పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 30వ వార్డుకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల యువ నాయకులు శుక్రవారం రాణా ప్రతాప్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. జూలూరి మనీష్‌గౌడ్ ఆధ్వర్యంలో, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ అధ్యక్షతన నిర్వహించిన చేరికల కార్యక్రమంలో గుంటి అరవింద్, ఎస్‌కే అజీమ్ పాషా, కాగితాల అనిల్, మద్రిపల్లి రవి (చిన్న బబ్బులు), కాసుల గణేష్, వల్లభ్‌నగర్‌కు చెందిన రాకేష్ తదితరులు కాషాయ కండువా కప్పుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన డా. రాణా ప్రతాప్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రజాదరణ తగ్గుతోందని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ అవినీతి రహిత పాలన, అభివృద్ధి, జాతీయవాద విధానాలకు ఆకర్షితులై యువత బీజేపీ వైపు వస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీల అమలుపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందని ఆరోపించారు. నర్సంపేటలో బీజేపీ నిర్వహిస్తున్న ప్రజా పోరాటాలు, సేవా కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని చెప్పారు. రాబోయే రోజుల్లో నర్సంపేట గడ్డపై కాషాయ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పించడంతో పాటు తగిన అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు విగ్నేష్, బీజేపీ నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షులు కాసుల నాగేంద్రబాబు, ఠాగూర్ విజయ్‌సింగ్, ముత్యాల శ్రీనివాస్, శామాల ప్రవీణ్, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు చిలువేరు అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.



# ముగ్గురు పిల్లలతో కలిసి రెజ్లర్ ఆత్మహత్య

**రెజ్లర్ అశ్విని సహా ముగ్గురి మృతి.. మరో చిన్నారి పరిస్థితి విషమం**

**కుటుంబ వేధింపులే కారణమంటూ తండ్రి ఫిర్యాదు**

**కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. నల్‌దుర్గ్ కోట వద్ద తీవ్ర విషాదం**

**ధారాశివ్, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** మహారాష్ట్రలోని ధారాశివ్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. 'మహారాష్ట్ర టైగ్రెస్'గా పేరొందిన జాతీయ స్థాయి మహిళా రెజ్లర్ అశ్విని మనోహర్ పాల్ తన ముగ్గురు పిల్లలతో కలిసి నల్‌దుర్గ్ కోట వద్ద లోయలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో అశ్విని, ఆమె ఐదేళ్ల కుమారుడు అజింక్యా మృతి చెందగా.. కవల కుమార్తెలలో క్రాంతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసింది. మరో చిన్నారి వీరా తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. జాతీయ స్థాయి రెజ్లింగ్‌లో అశ్విని ఐదు స్వర్ణాలు, ఆరు రజత పతకాలు సాధించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. క్రీడా రంగంలో గుర్తింపు పొందిన ఆమె మృతి తీవ్ర విషాదాన్ని నింపింది. అశ్విని మృతికి కుటుంబ సమస్యలే కారణమని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త, అత్తమామల నుంచి తన కుమార్తె శారీరక, మానసిక వేధింపులు ఎదుర్కొందని ఆయన ఆరోపించారు. ఫిర్యాదు ఆధారంగా నల్‌దుర్గ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆరోపణలపై విచారణ అనంతరమే పూర్తి వివరాలు వెల్లడవుతాయని పోలీసులు పేర్కొన్నారు.

# పవర్ లిఫ్టర్ కేయాకు ఆన్‌లైన్ వేధింపులు

**తన చిత్రాలను అసభ్యంగా మార్ఫింగ్ చేస్తున్నారని ఆవేదన**

**నకిలీ ఖాతాలు.. ఏఐ చిత్రాలతో వేధింపులంటూ వెల్లడి**

**'నా విజయాల గురించే మాట్లాడాలనుకున్నా' అంటూ భావోద్వేగ పోస్టు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** పవర్‌లిఫ్టింగ్‌లో 140 కిలోల బరువెత్తి సంచలనంగా మారిన భారత యువ అథ్లెట్ కేయా బెనర్జీ.. ఇప్పుడు తాను ఎదుర్కొంటున్న ఆన్‌లైన్ వేధింపులపై ఆవేదన వ్యక్తం చేశారు. తన పేరుతో నకిలీ ఖాతాలు సృష్టించడంతో పాటు తన ముఖం, శరీరాన్ని ఉపయోగించి కృత్రిమ మేధతో అసభ్యకర చిత్రాలను తయారు చేసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని వెల్లడించారు. ఇటీవల జరిగిన ఐపీఎఫ్ ప్రపంచ సబ్ జూనియర్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో కేయా రజత పతకం సాధించారు. 21 ఏళ్ల వయసులోనే 140 కిలోల బరువును ఎత్తిన ఆమె ప్రదర్శన సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తన బరువుతో పోలిస్తే మూడున్నర రెట్లకు పైగా బరువును ఎత్తడంతో భారత క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షించారు. అయితే తన క్రీడా విజయం తర్వాత ఆన్‌లైన్‌లో ఎదురైన అనుభవాలు తీవ్రంగా కలచివేశాయని కేయా తన కొత్త సామాజిక మాధ్యమ ఖాతాలో వెల్లడించారు. భారత మహిళా అథ్లెట్‌గా తాను లైంగిక వేధింపులతో పాటు జాతి, వంశం, కులాన్ని లక్ష్యంగా చేసుకున్న అభ్యంతరకర వ్యాఖ్యలను ఎదుర్కొన్నట్లు పేర్కొన్నారు. తన ముఖం, శరీరాన్ని అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి కృత్రిమ మేధతో రూపొందించిన అనేక నకిలీ చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో కనిపించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కేయా ఆవేదన వ్యక్తం చేశారు. తన పేరుతో నకిలీ ఖాతాలు కూడా సృష్టిస్తున్నారని తెలిపారు. తాను వ్యక్తిగత జీవితాన్ని గోప్యంగా ఉంచుకోవడానికే ఇష్టపడతానని, వ్యక్తిగత ఖాతాల్లో ఫొటోలను పెద్దగా పంచుకోనని పేర్కొన్నారు. కానీ ప్రతిరోజూ సామాజిక మాధ్యమాల్లో తనకు సంబంధించిన నకిలీ చిత్రాలు కనిపిస్తుండటం తీవ్ర అసహనానికి గురిచేస్తోందన్నారు. తన పాత ఖాతాను ఇన్‌స్టాగ్రామ్ ఇప్పటికే నిలిపివేసిందని, అందులో కేవలం 300 మంది అనుచరులు మాత్రమే ఉన్నారని కేయా తెలిపారు. కొత్త ఖాతా ద్వారా ఈ విషయాలను వెల్లడించాల్సి వచ్చిందన్నారు. 'నా గురించి మాట్లాడేటప్పుడు క్రీడల్లో సాధించిన విజయాలే ప్రస్తావనకు రావాలని కోరుకున్నా. ఈ విషయాలను బహిర్గతం చేయాలని ఎప్పుడూ అనుకోలేదు. కానీ నా పక్షాన నేను నిలబడేందుకు మరో మార్గం కనిపించలేదు' అని కేయా పేర్కొన్నారు. క్రీడా రంగంలో సత్తా చాటి దేశానికి పతకం అందించిన యువ అథ్లెట్.. తన విజయాన్ని ఆస్వాదించాల్సిన సమయంలో ఆన్‌లైన్ వేధింపులను ఎదుర్కోవాల్సి రావడం మహిళా క్రీడాకారుల డిజిటల్ భద్రతపై మరోసారి చర్చకు దారితీసింది.




# మంధాన మరో అరుదైన మైలురాయి

- మూడో భారత క్రికెటర్‌గా రికార్డు!
- మూడు ఫార్మాట్లలోనూ ఒకటికి మించి సెంచరీలు
- రోహిత్, రాహుల్ సరసన స్మృతి మంధాన
- ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా క్రికెటర్
- హాంకాంగ్‌పై 124 పరుగులతో విధ్వంసం
- సెమీస్‌లోకి దూసుకెళ్లిన భారత్




**కొలంబో, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** భారత మహిళా క్రికెట్ స్టార్ స్మృతి మంధాన అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో టెస్టులు, వన్డేలు, టీ20లు.. మూడు ఫార్మాట్లలోనూ ఒకటి కంటే ఎక్కువ సెంచరీలు సాధించిన మూడో భారత క్రికెటర్‌గా నిలిచారు. మహిళల ఆసియా కప్‌లో హాంకాంగ్‌పై సెంచరీతో ఈ ప్రత్యేక క్లబ్‌లో రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్ సరసన చేరారు. ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా క్రికెటర్ కూడా మంధానే కావడం విశేషం. అంతర్జాతీయ క్రికెట్‌లో రోహిత్ శర్మ టెస్టుల్లో 12, వన్డేల్లో 34, టీ20ల్లో 5 సెంచరీలు సాధించగా.. కేఎల్ రాహుల్ టెస్టుల్లో 12, వన్డేల్లో 8, టీ20ల్లో 2 శతకాలు నమోదు చేశారు. ఇప్పుడు స్మృతి మంధాన టెస్టుల్లో 2, వన్డేల్లో 14, టీ20ల్లో 2 సెంచరీలతో వారి సరసన నిలిచారు. అంతర్జాతీయ క్రికెట్‌లో సెంచరీల రారాజులుగా పేరొందిన సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ ఈ ప్రత్యేక జాబితాలో లేకపోవడం ఆసక్తికరం. కోహ్లీ టెస్టులు, వన్డేల్లో భారీ సంఖ్యలో సెంచరీలు సాధించినప్పటికీ అంతర్జాతీయ టీ20ల్లో ఒకే శతకం చేశారు. సచిన్ తన కెరీర్‌లో ఒకే ఒక్క అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడారు. హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో మంధాన ఆకాశమే హద్దుగా చెలరేగారు. 14 ఫోర్లు, 7 సిక్సర్లతో 124 పరుగులు చేసి భారత భారీ స్కోరుకు బాటలు వేశారు. ఆమె మెరుపు ఇన్నింగ్స్‌తో భారత్ 193 పరుగులు చేసింది. అనంతరం హాంకాంగ్‌ను 56 పరుగులకే ఆలౌట్ చేసి 137 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో మహిళల ఆసియా కప్‌లో భారత్ సెమీఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. మంధాన మాత్రం అరుదైన సెంచరీ రికార్డుతో మరోసారి భారత మహిళా క్రికెట్‌లో తన ప్రత్యేకతను చాటుకున్నారు.

# 2027 ప్రపంచకప్‌పై గురి

## బుమ్రా కోసం 'ప్లాన్ బీ'!

**స్టార్ పేసర్ ఫిట్‌నెస్‌పై బీసీసీఐ ప్రత్యేక దృష్టి**

**బెంగళూరులో మ్యాచ్ సిమ్యులేషన్ పరీక్షలు**

**ఆఫ్ఘన్ సిరీస్‌కు ముందు తుది అంచనా**

**బుమ్రాకు విశ్రాంతిస్తే ప్రిన్స్ యాదవ్‌కు ఛాన్స్**

**దీర్ఘకాలిక పనిభారం నిర్వహణకే ప్రాధాన్యం**




**బెంగళూరు, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా విషయంలో బీసీసీఐ ఆచితూచి అడుగులు వేస్తోంది. ప్రతి సిరీస్‌లోనూ అతడిని బరిలోకి దింపడం కంటే కీలక సమయాల్లో పూర్తి ఫిట్‌నెస్‌తో అందుబాటులో ఉండేలా పనిభారాన్ని నిర్వహించడానికే ప్రాధాన్యం ఇస్తోంది. ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ముందు బుమ్రా ఫిట్‌నెస్‌ను మరోసారి పూర్తిస్థాయిలో పరీక్షిస్తోంది. ఒకవేళ అతడికి విశ్రాంతి ఇవ్వాల్సి వస్తే యువ పేసర్ ప్రిన్స్ యాదవ్‌ను ప్రత్యామ్నాయంగా సిద్ధంగా ఉంచుతున్నట్లు సమాచారం. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సెప్టెంబర్ 4 నుంచి 9 వరకు మ్యాచ్ సిమ్యులేషన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. బుమ్రాతో పాటు నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా కూడా వీటిలో పాల్గొంటున్నారు. వైద్య బృందం వీరిని క్లినికల్‌గా ఫిట్‌గా ప్రకటించినప్పటికీ.. మ్యాచ్ పరిస్థితుల్లో శారీరక సామర్థ్యం, వరుసగా బౌలింగ్ చేసే శక్తి, పనిభారాన్ని తట్టుకునే సామర్థ్యాన్ని అంచనా వేసేందుకే ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఆఫ్ఘనిస్తాన్‌తో మూడు టీ20ల సిరీస్ కోసం భారత జట్టు సెప్టెంబర్ 10న ఢిల్లీలో సమావేశం కానుంది. సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో మ్యాచ్‌లు జరగనున్న నేపథ్యంలో అంతకంటే ముందే బుమ్రా ఫిట్‌నెస్‌పై స్పష్టత రావాల్సి ఉంది. బుమ్రా విషయంలో కేవలం గాయం నుంచి కోలుకున్నారా లేదా అన్నదే కాకుండా.. మ్యాచ్ ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం, వరుసగా బౌలింగ్ చేయగల శక్తి, దీర్ఘకాలిక పనిభారాన్ని పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

### 'ప్లాన్ బీ'గా ప్రిన్స్ యాదవ్?

ఒకవేళ బుమ్రాకు విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయిస్తే యువ పేసర్ ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం దక్కవచ్చని సమాచారం. జూన్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ప్రిన్స్.. ఆ తర్వాత జింబాబ్వే పర్యటనలో గాయంతో ఇబ్బంది పడ్డాడు. ప్రస్తుతం కోలుకుని ఫిట్‌నెస్ క్లియరెన్స్ పొందినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. 2026 ఐపీఎల్‌లో ఆకట్టుకున్న ప్రదర్శనతో ప్రిన్స్ యాదవ్‌ను పరిమిత ఓవర్ల క్రికెట్‌లో భవిష్యత్ పేసర్‌గా సెలెక్టర్లు పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో బుమ్రా అందుబాటులో లేకుంటే ఆఫ్ఘన్ సిరీస్‌లో అతడికి మరో అవకాశం దక్కవచ్చు. 2026లో గాయం తర్వాత బుమ్రా పనిభారాన్ని భారత జట్టు మేనేజ్‌మెంట్ జాగ్రత్తగా పర్యవేక్షిస్తోంది. ఒక్క ఆఫ్ఘనిస్తాన్ సిరీస్‌ను కాకుండా రాబోయే కీలక సిరీస్‌లు, 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని అతడిని వినియోగించాలన్నది బీసీసీఐ వ్యూహంగా కనిపిస్తోంది. ఫిట్‌నెస్ పరీక్షల్లో బుమ్రా పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నట్లు తేలితే ఆఫ్ఘనిస్తాన్‌తో సిరీస్‌లో బరిలోకి దిగే అవకాశం ఉంటుంది. లేదంటే అతడిపై తొందరపడకుండా విశ్రాంతి ఇచ్చి.. 'ప్లాన్ బీ'గా ప్రిన్స్ యాదవ్‌ను రంగంలోకి దింపే అవకాశమున్నట్లు తాజా నివేదికలు సూచిస్తున్నాయి.

# క్రికెటర్ రోహిత్‌పై రెండేళ్ల నిషేధం!

**ధ్రువీకరణ పత్రాల్లో మూడు పుట్టిన తేదీలు**

**వయసులో 27 నెలల వ్యత్యాసం గుర్తింపు**

**ఆస్ట్రేలియా సిరీస్ నుంచి తక్షణమే తొలగింపు**

**మరో 64 మంది యువ క్రికెటర్లపైనా చర్యలు**




**కోల్‌కతా, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** బిగ్ షాక్: క్రికెటర్ రోహిత్ యాదవ్‌పై రెండేళ్ల కఠిన నిషేధం విధించిన బీసీసీఐ రోహిత్ యాదవ్‌పై నిషేధం (19) 64 మందిపై బెంగాల్ వేటు (18) వయసు మోసాలపై ఉక్కుపాదం (19) కోల్‌కతా, సెప్టెంబర్ 4 (స్పందన న్యూస్): వయసు ధృవీకరణ పత్రాల్లో తీవ్ర అవకతవకలకు పాల్పడిన భారత అండర్-19 జట్టు ఆటగాడు, బెంగాల్ లెగ్ స్పిన్నర్ రోహిత్ యాదవ్‌పై భారత క్రికెట్ నియంత్రణ మౌలిక మండలి (దీజజ×) రెండేళ్ల పాటు కఠిన నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. నూతన క్రికెట్ సీజన్ ముందస్తుగా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ (జూూదీ) చేపట్టిన పత్రాల పరిశీలనలో ఈ జాలీ మోసం వెలుగుచూసింది. ఇటీవల శ్రీలంక పర్యటనలో అద్భుత ప్రదర్శన చేసి, త్వరలో ఆస్ట్రేలియాతో జరగబోయే ద్వైపాక్షిక సిరీస్‌కు ఎంపికైన రోహిత్ వద్ద వేర్వేరు పుట్టిన తేదీలతో ధృవీకరణ పత్రాలు ఉండటమే కాకుండా, వయసులో ఏకంగా 27 నెలల వ్యత్యాసం ఉన్నట్లు నిరూపితమైంది. దీంతో అతడిని ఆస్ట్రేలియా సిరీస్ నుంచి తక్షణమే తొలగించి, దేశంలోని అన్ని రాష్ట్రాల క్రికెట్ సంఘాలకు హెచ్చరిక సమాచారం పంపారు. రోహిత్ యాదవ్‌తో పాటు ఇలాంటి వయసు వ్యత్యాసాలకు పాల్పడిన మరో 64 మంది క్రికెటర్లపై బెంగాల్ క్రికెట్ సంఘం వేటు వేసింది. ఈ నిషేధిత జాబితాలో 2022 అండర్-19 ప్రపంచకప్ సాధించిన భారత జట్టులో కీలక పాత్ర పోషించిన ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ రవికుమార్ కూడా ఉండటం క్రికెట్ వర్గాల్లో సంచలనం రేపింది. రవికుమార్ వయసులో 40 నెలలకు పైగా భారీ వ్యత్యాసం ఉన్నట్లు నిర్ధారించడంతో అతడి పాత జూనియర్ రికార్డులన్నింటినీ రద్దు చేశారు. భారత జూనియర్ క్రికెట్‌లో సుదీర్ఘకాలంగా ప్రధాన సమస్యగా మారిన వయసు మోసాలను తీవ్రంగా పరిగణిస్తున్న బీసీసీఐ, 2020లో స్వచ్ఛందంగా నిజమైన వివరాలు వెల్లడించేందుకు ఇచ్చిన సడలింపులను ఉల్లంఘించిన ప్రతీ ఒక్కరిపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేసింది.



# కృష్ణాష్టమి స్పెషల్

## రాధే కృష్ణ అంటూ నాట్య భంగిమల్లో అలరించిన 'అనసూయ'

### 'కృష్ణుడికి అంతా తెలుసు.. నాకు అది చాలు' అంటూ వ్యాఖ్య

### సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా ఫొటోలు, వీడియో

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రముఖ యాంకర్, నటి అనసూయ భరద్వాజ్ ప్రత్యేకంగా సందడి చేశారు. సంప్రదాయ ఎర్రచీరలో నాట్య భంగిమలతో దిగిన ఫొటోలతో పాటు భక్తిగీతానికి నృత్యం చేసిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు, వీడియో అభిమానులను ఆకట్టుకుంటూ వైరల్‌గా మారాయి. 'తులసీ కోమలవేణి...' అనే కన్నడ భక్తిగీతానికి అనసూయ నృత్యం చేశారు. సంప్రదాయ వస్త్రధారణలో అభినయంతో కూడిన నాట్య భంగిమలను ప్రదర్శించారు. ఈ వీడియోకు 'కృష్ణుడికి అంతా తెలుసు.. నాకు అది చాలు' అంటూ క్యాప్షన్ జోడించారు. అంతేకాకుండా ప్రశాంతత, స్వీయ నియంత్రణ, స్వచ్ఛత, క్షమాగుణం, ముక్కుసూటితనం, జ్ఞానం వంటి లక్షణాల ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తూ అందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. అనసూయ పోస్ట్‌కు అభిమానుల నుంచి స్పందన వస్తోంది. ఇటీవల సనాతన ధర్మంపై ఆమె చేసిన వ్యాఖ్యల చుట్టూ సామాజిక మాధ్యమాల్లో చర్చ జరిగిన నేపథ్యంలో.. కృష్ణాష్టమి సందర్భంగా ఆమె పంచుకున్న తాజా వీడియో కూడా నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది.



# నోరుపారేసుకున్న నటి కస్తూరి




కొందరు సెలబ్రిటీలు ఏం మాట్లాడినా, ఏం చేసినా ఖచ్చితంగా వివాదాస్పదం అవుతుంది. ఈ కోవలోకే వస్తారు తమిళ నటి కస్తూరి శంకర్. మనసులో ఎలాంటి భావం ఉన్నా ఉన్నది ఉన్నట్లు ముఖం మీద చెప్పడంతో ఈమె ముందు వరుసలో ఉంటారు. తొలి నుంచి డేరింగ్ అండ్ డాషింగ్ బిహేవియర్‌తో ఏరికోరి వివాదాల్లో చిక్కుకున్నారు కస్తూరి. సినీరంగంలో మహిళలపై వేధింపులు, క్యాస్టింగ్ కౌచ్‌తో పాటు తమిళనాడులో ఉంటున్న తెలుగువారిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి జైలుకు కూడా వెళ్లొచ్చారు. ఆ తర్వాత కాస్త సైలెంట్ అయినప్పటికీ తిరిగి యాక్టీవ్ అయ్యారు. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తుతం హీరో పాత్రలను చూపిస్తున్న విధానంపై కస్తూరి శంకర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 1991లో ఆతా ఉన్ కోయిలే సినిమా ద్వారా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన ఆమె.. మూడున్నర దశాబ్ధాల కెరీర్‌లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వందకు పైగా చిత్రాల్లో నటించారు. నిప్పు రవ్వ, గాడ్ ఫాదర్, సొగ్గాడి పెళ్లాం, మెరుపు, చిలక్కొట్టుడు, అన్నమయ్య, మా ఆయన బంగారం, ఆకాశ వీధిలో, డాన్ శీను, శమంతకమణి, సింబా వంటి సినిమాలతో తెలుగువారిని పలకరించారు. కెరీర్ పీక్స్‌లో ఉండగానే పెళ్లి చేసుకున్న కస్తూరి ఆ తర్వాత తన కెరీర్‌కు కొన్నాళ్లు బ్రేక్ ఇచ్చి ఫ్యామిలీ, పిల్లల కోసం అంకితమయ్యారు. ఇటీవల సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన కస్తూరి.. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారిపోయారు. సినిమాలే కాదు బుల్లితెరపైనా ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకులను అలరిస్తున్నారు. తెలుగులో ఆమె నటించిన గృహలక్ష్మీ సీరియల్.. ప్రేక్షకులకు కస్తూరిని దగ్గర చేసింది. ప్రస్తుతం ధర్మస్థల నియోజకవర్గం అనే తెలుగు మూవీలో కస్తూరి శంకర్ నటించారు. ఇందులో నెగిటివ్ షేడ్స్ ఉన్న రోల్‌లో కస్తూరి నటించినట్లుగా వార్తలు వస్తున్నాయి. మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ బ్యానర్‌పై మేరుం భాస్కర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సుమన్, సాయికుమార్, నటరాజ్, రాయంచ కొక్కుర, వరుణ్ సందేశ్, వితికా షేరులు ఈ సినిమాలో కీలకపాత్రలు పోషించారు. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 4న ధర్మస్థల నియోజకవర్గం మూవీ వరల్డ్ వైడ్‌గా విడుదలైంది. ఈ సినిమా ప్రమోషన్స్ కార్యక్రమాల్లో భాగంగా చిత్ర యూనిట్ ఓ ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చింది. ఈ సందర్భంగా కస్తూరి మాట్లాడారు. ఈ మధ్యకాలంలో అన్ని రకాల సినిమాలు వస్తున్నాయి. సినిమాను సినిమాగానే చూడాలని ఒకపక్క ఉంది. తెలుగు సినిమాలు చూస్తూ పెరిగిన దానిని, మాయాబజార్.. కృష్ణార్జున యుద్ధం, ప్రేమాభిషేకం లాంటి సినిమాలు చేసి పెరిగాను. అప్పుడు చూస్తే తెలుగు సినిమాల్లో హీరోలంటే దేవుడు.. దేవుడి అవతారాలు కనిపించేవి. ఆ తర్వాత సాంఘిక చిత్రాలు వచ్చాయి. వాటిలో హీరో పోలీస్, లాయర్, విప్లవకారుడు, న్యాయం కోసం పోరాడే వ్యక్తిగా కనిపించాడు. ఇప్పుడొచ్చే సినిమాల్లో స్మగ్లర్, క్రిమినల్, గ్యాంగ్‌స్టర్ అలాంటి సినిమాలే వస్తున్నాయి. ఇలాంటి వాటి మధ్య ఒక సామాజిక బాధ్యతతో, సామాజిక సందేశంతో వస్తున్న మూవీ అంటే చాలా అరుదు అన్నట్లుగా మారిపోయింది. అలాంటి సినిమాల్లో మా ధర్మస్థల నియోజకవర్గం కూడా ఒకటి అని కస్తూరి చెప్పారు. డైరెక్టర్ ప్రభ గారు నా దగ్గరికి వచ్చిన స్టోరీలో ఒక లైన్ చెప్పారు. అప్పుడే ఆ స్టోరీ నాకు బాగా నచ్చేసింది. నిర్మాత భాస్కర్ గారు ఏఎం రత్నంగారి టీమ్.. నన్ను తెలుగువారిని పరిచయం చేసింది భారతీయుడు చిత్రం. ఆ కనెక్షన్ కూడా నాకుంది. భారతీయుడు, అన్నమయ్య లాంటి సినిమాలు చేసి ఆ తర్వాత పెళ్లి చేసుకుని ఫారిన్‌కి వెళ్లిపోయా. ఇప్పుడు మళ్లీ తిరిగొచ్చి గృహలక్ష్మీగా అందరికి దగ్గరైన కస్తూరిని ఈ సినిమాలో ఎలా చూపిస్తారో అనుకున్నాను. కానీ ఆయన వచ్చి నన్ను దారుణమైన నెగిటివ్ క్యారెక్టర్ చేయించడంతో షాకయ్యా. నేను ఇప్పటి వరకు ఇలాంటి రోల్‌లో అస్సలు చేయలేదు. కస్తూరి అంటే మా ఇంటి ఆడపిల్ల అని అందరూ అనుకునేవారు.. కానీ ఈ సినిమాలో చీర కూడా కట్టనివ్వలేదు అని కస్తూరి తెలిపారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారాయి.

### తొలిసారి 'హారర్ కామెడీ' బాటలో

# మాస్ మహారాజా

### హారర్ కామెడీగా కొత్త మూవీ

### సంక్రాంతి కానుకగా విడుదల



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్):** ఇటీవల విడుదలైన 'ఇరుముడి' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద రూ. 200 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టిన మాస్ మహారాజా రవితేజ, తన భవిష్యత్ ప్రాజెక్టుల విషయంలో ఊహించని వినూత్న బాట పట్టారు. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన ఈ బ్లాక్‌బస్టర్ విజయం ఇచ్చిన జోష్‌తో, కెరీర్‌లోనే మునుపెన్నడూ చేయని సరికొత్త కథాంశాలను ఆయన ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో ఒక వైవిధ్యమైన చిత్రానికి అంగీకారం తెలిపారు. తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో రవితేజ తొలిసారిగా 'హారర్ కామెడీ' జోనర్‌లోకి అడుగుపెడుతుండటం సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. వివేక్ ఆత్రేయ మార్క్ స్క్రీన్‌ప్లే, రవితేజ నటన, ఎనర్జీ తోడైతే థియేటర్లలో వినోదం హామీ అని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. లక్ష్మణ్, శ్రీని నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉంది. దీంతో పాటు 'రాజ రాజ చోర' ఫేమ్ హసిత్ గోలి దర్శకత్వంలో శ్రీవిష్ణుతో కలసి దిల్ రాజు నిర్మిస్తున్న మల్టీస్టారర్ కామెడీ చిత్రంలోనూ రవితేజ నటించనున్నారు. ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.

# ఓటీటీలోకి కాంట్రవర్సీ మూవీ

ఇటీవల కొన్ని సినిమాలు విడుదలకు ముందే వివాదాల్లో చిక్కుకుంటున్నాయి. సినిమాల్లోని కొన్ని సన్నివేశాలు లేదా సంభాషణల విషయంలో కొన్ని సంస్థలు ఈ చిత్రాలను వ్యతిరేకించడంతో అవి థియేటర్లలో విడుదల కావడం లేదు. అలాగే బోల్డ్ కంటెంట్ కారణంగా కూడా కొన్ని సినిమాలు విడుదల కాలేదు. అయితే, ఈ చిత్రాలు ప్రస్తుతం ఓటీటీలో అందుబాటులో ఉన్నాయి. ప్రేక్షకులు కూడా ఈ చిత్రాలను ఓటీటీలో చూసేందుకు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. అలా థియేటర్లలో నిషేధానికి గురై ఓటీటీలో సంచలనం సృష్టించిన సినిమా 'అన్‌ఫ్రీడమ్'. బాలీవుడ్ దర్శకుడు రాజ్ అమిత్ కుమార్ తెరకెక్కించిన ఈ సినిమాలో ఉగ్రవాదం, మత ఛాందసవాదం, స్వలింగ సంపర్కం, ప్రేమ, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి సున్నితమైన అంశాలు ఉన్నాయి. దీంతో 2015లో ఈ చిత్రానికి భారతదేశంలో థియేటర్లలో విడుదలకు ఆమోదం లభించలేదు. 'అన్‌ఫ్రీడమ్' సినిమా కథ వివిధ పాత్రల జీవితాల చుట్టూ తిరుగుతుంది. ఒకవైపు ఇది ఉగ్రవాదం, మత ఛాందసవాదం వంటి సమస్యలను ప్రస్తావిస్తూనే, మరోవైపు తమ సొంత గుర్తింపు, ప్రేమ, తాము కోరుకున్నట్లుగా జీవించే హక్కు కోసం పోరాడుతున్న వ్యక్తుల కథను ఆవిష్కరిస్తుంది.'అన్‌ఫ్రీడమ్' చిత్రాన్ని భారతదేశంలో విడుదల కోసం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (జదీఖీజ)కి సమర్పించారు. అయితే, చిత్రంలోని కొన్ని సన్నివేశాలు, సున్నితమైన అంశాలపై బోర్డు అభ్యంతరం తెలిపి, పలు మార్పులను సూచించింది. స్వలింగ సంపర్కానికి సంబంధించిన డైలాగులు, శృంగార సన్నివేశాలు, అలాగే ఉగ్రవాదానికి సంబంధించిన కొన్ని సీన్లు, డైలాగులను తొలగించాలని సెన్సార్ బోర్డ్ సూచించింది. అయితే నిర్మాతలు మాత్రం సెన్సార్ బోర్డు సూచించిన మార్పులు చేయడానికి నిరాకరించారు. సన్నివేశాలను లేదా కంటెంట్‌ను మార్చడం వల్ల సినిమా అంతా ఎఫెక్టివ్ గా ఉ ండదని దర్శక నిర్మాతలు భావించారు. దీని తర్వాత, చిత్ర బృందం సెన్సార్ బోర్డు నిర్ణయానికి వ్యతిరేకంగా అప్పీల్ చేసింది. అయినప్పటికీ, 'అన్‌ఫ్రీడమ్' చిత్రాన్ని భారతదేశంలోని థియేటర్లలో విడుదల చేయడానికి అనుమతించలేదు. భారతదేశంలో విడుదల కానప్పటికీ 'అన్‌ఫ్రీడమ్' అంతర్జాతీయంగా పలు సినిమా ఈవెంట్లు, ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్ లోనూ ప్రదర్శితమైంది. పలు సున్నితమైన అంశాలను చూపించిన తీరుకు పలు ప్రశంసలు, అవార్డులు కూడా వచ్చాయి. సెన్సార్‌షిప్, భావ ప్రకటనా స్వేచ్ఛ, భారతీయ సినిమాలో సున్నితమైన అంశాల చిత్రీకరణపై చర్చలను రేకెత్తించిన చిత్రాలలో 'అన్‌ఫ్రీడమ్' సినిమాను ఒకటిగా పరిగణిస్తారు. ప్రస్తుతం ఈ సినిమా ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉంది.




Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 7036644111, 9490140565

# ప్రజల ఆశీర్వాదంతో ప్రజాపాలనకు 1000 రోజులు

- **రైతులు, మహిళలు, యువత సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: నీలం పద్మ వెంకటస్వామి**



**ఆలేరు, సెప్టెంబర్ 04(సమయం న్యూస్):** ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో 1000 రోజులు పూర్తి చేసుకోవడం చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి అన్నారు. ప్రజాపాలన 1000 రోజుల సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆమె పేర్కొన్నారు. రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ చేసి 25 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని, రైతు భరోసాను ఎకరానికి రూ.12 వేలకు పెంచామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు, సన్నవడ్ల బోనస్‌తో రైతులకు అండగా నిలిచామని చెప్పారు. వ్యవసాయ రంగానికి రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేశామని, రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు, ఉచిత వ్యవసాయ విద్యుత్‌కు రూ.30 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. పేదల సంక్షేమంలో భాగంగా గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే ఎల్పీజీ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని, ఆహార భద్రత కార్డుల ద్వారా కోట్లా ది మందికి ప్రయోజనం కలుగుతోందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా 70 వేలకు పైగా ప్రభుత్వ నియామకాలు చేపట్టామని పద్మ తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేయడం వంటి చర్యలు చేపట్టా మన్నారు. విద్యా రంగంలో పాఠశాలలు, కళాశాలల్లో అల్పాహారం ప్రారంభించడంతో పాటు 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ వంటి నిర్ణయాలు సామాజిక న్యాయానికి దోహదపడుతున్నాయని ఆమె అన్నారు. రైతులు, మహిళలు, వ్యవసాయ కూలీలు, బలహీనవర్గాలను ప్రభుత్వ విధానాలకు కేంద్రబిందువుగా మార్చామని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ సామాజిక న్యాయ లక్ష్యానికి అనుగుణంగా తెలంగాణలో కీలక నిర్ణయాలు తీసుకుంటూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని పద్మ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చేస్తున్న విమర్శలను ప్రజలు గమనిస్తున్నారని, ఎవరి పాలన ఎలా ఉందో ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి, కౌన్సిలర్లు లావణ్య, సరోజ, ధనలక్ష్మి, రహీమా బేగం, రాష్ట్ర కార్యదర్శి పావని, మార్కెట్ చైర్మన్ చైతన్య, జిల్లా జనరల్ సెక్రటరీ పుష్ప, మండల అధ్యక్షులు కాల్యే లత, రేణుక, మమత, పలువురు మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అక్షరం నేర్పిన గురువుకు.. ఆత్మీయ సత్కారం..

- **జ్ఞానంతో పాటు సంస్కారం నేర్పేదే నిజమైన విద్య**
- **కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజోత్సవం.. పలువురు గురువులకు సన్మానం**
- **తరతరాల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయుడే... బొక్క కుమార్**



**హనుమకొండ, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్) :** గురువు కేవలం విద్యాబోధకుడు మాత్రమే కాదని.. విద్యార్థుల జీవితాలకు దిశానిర్దేశం చేస్తూ భావితరాలను తీర్చిదిద్దే శిల్పి అని కిట్స్ వాకర్స్ అసోసియేషన్ హనుమకొండ అధ్యక్షుడు బొక్క కుమార్ అన్నారు. గురువును గౌరవించడం భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని తెలిపారు. మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం కిట్స్ కళాశాల మైదానంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవలందిస్తున్న, విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా బొక్క కుమార్ మాట్లా డుతూ భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రుల తర్వాత గురువుకు అత్యున్నత స్థానం ఉందన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులపై ఉందని వివరించారు.

**సాంకేతికతతో పాటు సంస్కారం అవసరం...**

సాంకేతిక పరిజ్ఞానం విస్తరించడం వల్ల విద్యార్థులకు ఎన్నో అవకాశాలు అందుబాటులోకి వస్తున్నప్పటికీ.. సోషల్ మీడియా, మొబైల్ ఫోన్ల దుర్వినియోగం ఆందోళన కలిగిస్తోందని బొక్క కుమార్ అన్నారు. గురువు చెప్పే మాట వినేందుకు సమయం కేటాయించని విద్యార్థులు సోషల్ మీడియాకు గంటల తరబడి సమయం వెచ్చించడం ఆలోచించాల్సిన విషయమన్నారు. సమాచారం అందుబాటులోకి రావడం విద్య కాదు.. ఆ సమాచారాన్ని వివేకంతో ఉపయోగించగలగడమే నిజమైన విద్య అని స్పష్టం చేశారు. విద్యార్థులు ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూనే సంస్కారం, క్రమశిక్షణ, గురువుల పట్ల గౌరవం, తల్లి దఢ్రుల పట్ల బాధ్యత, సమాజం పట్ల సేవాభావాన్ని అలవరచుకోవాలని సూచించారు.

**మార్కులు మాత్రమే కాదు.. మంచి మనిషిగా ఎదగాలి...**

విద్యార్థుల విజయాన్ని కేవలం మార్కులు, ర్యాంకులు, ఉద్యోగాలతోనే కొలవడం సరికాదని బొక్క కుమార్ అన్నారు. మార్కులు ఉద్యోగాన్ని అందించవచ్చని.. కానీ సంస్కారం సమాజంలో గౌరవాన్ని తెస్తుందని చెప్పారు. డిగ్రీ జీవనోపాధిని కల్పించవచ్చని.. గురువులు నేర్పిన విలువలు జీవితానికి అర్థాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలు కేవలం విద్యావంతులుగా కాకుండా వివేకవంతులు, సంస్కారవంతులు, బాధ్యతాయుత పౌరులుగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, సామాజిక సంస్థలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**గురువు.. భావితరాల నిర్మాణకర్త...**

ఒక మంచి గురువు ప్రభావం ఒక్క విద్యార్థితో ఆగిపోదని.. ఆ విద్యార్థి ద్వారా కుటుంబం, సమాజం, దేశంపై కూడా పడుతుందని బొక్క కుమార్ అన్నారు. గురువు ఒక దీపం.. తాను కరిగి ఇతరులకు వెలుగునిస్తాడు. గురువు ఒక శిల్పి.. బాల్యాన్ని మహోన్నతమైన వ్యక్తిత్వంగా మలుస్తాడు. గురువు ఒక దిక్సూచి.. జీవిత ప్రయాణంలో విద్యార్థికి సరైన దిశ చూపిస్తాడని అభివర్ణి ంచారు. ఈ సందర్భంగా ఆకుల సదానందం, కే. రాజేశ్వర్‌రెడ్డి, గూడూరు లక్ష్మీనారాయణ, చెన్నూరి సత్యనారాయణ, మాటేటి రవీందర్, గంగినేని రవికుమార్, కేశినేని మహేందర్‌రాజు, కరాట్లపల్లి శ్రీనివాస్, అజ్మీర గణేష్, బానోతు అరుణ, బొక్క కిషన్, మురాల శంకర్‌రావు, సంఘకారి రాజు, ఈగ సురేందర్, పొగాకు రతన్‌కుమార్, బొక్క అశోక్, చిలువేరు శోభన్, కర్నాటి భద్రయ్య, పాపిశెట్టి వెంకటేశం, వేల్పుల ఓదెలు తదితర ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి వాకర్స్ మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గురువులను గౌరవించడం ద్వారా విద్య విలువను, సంస్కారాన్ని, భావితరాల భవిష్యత్తును గౌరవించినట్లేననే సందేశాన్ని కార్యక్రమంలో చాటారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన.. వంటావార్పుతో బీఆర్ఎస్ నిరసన





- **హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం... దాస్యం వినయ్‌భాస్కర్**

**హనుమకొండ, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్) :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయిన సందర్భంగా మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకశిలా పార్కు వద్ద వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. వెయ్యి రోజుల పాలన ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యానికి నిదర్శనంగా మారిందన్నారు వృద్ధులు, వికలాంగులు, మహిళలు, రైతులు, విద్యార్థులు, పేద కుటుంబాలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరిస్తోందని ఆరోపించారు. వృద్ధులకు రూ.4 వేల పింఛన్, వికలాంగులకు రూ.6 వేల పింఛన్, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు.

**సంక్షేమ పథకాలను విస్మరిస్తున్నారు...**

మహిళలు, గర్భిణులు, చిన్నారుల సంక్షేమం కోసం గతంలో అమలు చేసిన కేసీఆర్ కిట్ వంటి కార్యక్రమాలను కొనసాగించకపోవడం పేద కుటుంబాలకు నష్టం కలిగిస్తోందని వినయ్‌భాస్కర్ అన్నారు. పేదింటి ఆడపిల్లల వివాహాలకు అండగా నిలిచిన కల్యాణలక్ష్మి పథకాన్ని కూడా సమర్థవంతంగా అమలు చేయకుండా లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. విద్యార్థి నులకు స్కూటీలు అందిస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడం ద్వారా మహిళా విద్యార్థుల పట్ల ప్రభుత్వ నిర్ల క్ష్యం స్పష్ట మవుతోందన్నారు. విద్యార్థులు, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు, అనేక హామీలు ఇచ్చి ఓట్లు అడిగారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో హామీని పక్కన పెడుతూ ప్రజలను మోసం చేస్తున్నారు. మాటలు చెప్పడం కాదు.. ఇచ్చిన హామీ లను అమలు చేయాలన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోక పోవడం వల్లే వంటావార్పు వంటి వినూత్న నిరసనలకు దిగాల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల ఆకాంక్షలు, ఆవే దనను ప్రభుత్వానికి తెలియజేయడమే తమ ఉద్దేశమని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పోలిస్తే ప్రస్తుత పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులకు అండగా నిలిచే సంక్షేమ కార్యక్రమాలను బలోపేతం చేయాలని కోరారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం మొండి వైఖరిని వీడి ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేయాలని, వాటిపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటిం చాలని డిమాండ్ చేశారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిలిచి పోరాటాలు కొనసాగిస్తుందని దాస్యం వినయ్ భాస్కర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ అధ్యక్షులు, మహిళా డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, కార్య కర్తలు, మహిళలు, వికలాంగులు పాల్గొన్నారు.

## కల్లూ రులో ఘనంగా శ్రీకృష్ణా ష్ట మి వేడుకలు





**పోతంగల్, సెప్టెంబర్ 04 ( సమయం న్యూస్ ) :-** పోతంగల్ మండల కేంద్రంలోని కల్లూరు గ్రామంలో శ్రీకృష్ణా ష్టమి వేడుకలు శ్రీరామ గణేష్ మండలి ఆధ్వర్యంలో అత్యంత అంగరంగ వైభవంగా జరిగాయి. పండుగను పురస్కరించుకుని గ్రామంలో భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక ఉత్సాహం వెల్లి విరిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారి కృష్ణులు, రాధల ముద్దులొలికే అభినయాలు గ్రామస్థులను అలరించాయి. అనంతరం నిర్వహించిన సాంప్రదాయ ఉట్టి కొట్టే కార్యక్రమం వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువకులు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొని ఉట్టిని కొట్టడానికి పోటీపడటంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో శ్రీరామ గణేష్ మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను దిగ్విజయం చేశారు.

## మహిళలు కోటీశ్వరులుగా ఎదగాలి: మంత్రి సీతక్క



**సత్తుపల్లి, సెప్టెంబర్ 4( సమయం న్యూస్)** మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి కోటీశ్వరులుగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. సత్తుపల్లిలో నిర్వహించిన ఇందిర మహిళాశక్తి సదస్సులో ఆమె మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, బీమా, ఉపాధి అవకాశాలు కల్పిస్తు న్నామని తెలిపారు. క్యాంటీన్లు, డెయిరీ, పౌల్ట్రీ, సోలార్, కుట్టు యూనిట్లు వంటి వ్యాపారాలు చేపట్టి ఆదాయం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టీఎస్, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ఉద్యోగాలకు 60 రోజుల ఉచిత శిక్షణ



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 4( సమయం న్యూస్)** కానిస్టే బుల్ ఎస్ఐ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం బీసీ, ఎస్సీ స్ట డీ సర్కిళ్ల ఆధ్వర్యంలో 60 రోజుల ఉచిత ప్రత్యేక శిక్షణ నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మొత్తం 200 మందికి—100 మంది కానిస్టే బుల్ 100 మంది ఎస్ఐ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. అర్హులు సెప్టెంబర్ 5 నుంచి 11 వరకు ఆదిలాబాద్ బీసీ స్ట డీ సర్కిల్‌లో ఆఫ్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ/ఈడ బ్ల్యూఎస్/అనాథలకు తలా 25 శాతం చొప్పున అవకాశాలు కల్పిస్తారు. మెరిట్ జాబితాను సెప్టెంబర్ 16న విడుదల చేసి, 17–18 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు. శిక్షణ సెప్టెంబర్ 19 నుంచి ప్రారంభమవుతుంది.ఉచిత పుస్తకాలు, నిపుణులతో రోజుకు నాలుగు తరగతులు, వారానికి ఒక పూర్తి స్థాయి పరీక్ష నిర్వహిస్తారు. వివరాలకు 08732-221280, 9949684959, 9494149416 నంబర్ల ను సంప్రదించవచ్చు.

## సూరారం అభివృద్ధికి రూ.2.04 కోట్లు



**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 4 ( సమయం న్యూస్) :** బాలానగర్ మండలం సూరారం గ్రామంలో రూ.2.04 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు , అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఎంపీ డీకే అరుణ శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, కలెక్ట ర్ ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎంపీ తెలిపారు. సూరారం గ్రామాన్ని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ పేర్కొన్నారు. వి-గార్డ్ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని కూడా ప్రారంభించారు.

సమయం



## బీఆర్ఎస్‌కు షాక్. కాంగ్రెస్ లోకి నల్ల బెల్లి నేతలు

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



**సంగెం, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్) :** సంగెం మండలం నల్ల బెల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో ఎరుకల ఐలయ్య, ఎరుకల రాజు, బోగుట సుమన్, రాజా మోహన్, కోడూరి వేణు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకూ విశ్వాసం పెరుగుతోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు.

## భద్రాచలం ఆలయ పనులు వేగవంతం చేయాలి: మంత్రి పొంగులేటి



**భద్రాచలం, సెప్టెంబర్ 4:( సమయం న్యూస్)** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను మూడు షిఫ్టుల్లో 24 గంటలు కొనసాగిస్తూ వేగవంతం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 25 శాతం పనులే పూర్తయ్యాయని అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, నాణ్యతలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పోలవరం బ్యాక్‌వాటర్ ముప్పు పెరిగిందని ఆరోపించారు. తెలంగాణలోని ముంపు ప్రాంతాలపై కేంద్రం పునఃపరిశీలించాలని, ముఖ్యమంత్రి నేతృత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి కేంద్రాన్ని కోరనున్నట్లు తెలిపారు.

## కోటగిరిలో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్ట మి వేడుకలు



**కోటగిరి, సెప్టెంబర్ 04 (సమయం న్యూస్ )** కోటగిరి శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వివేకానంద పాఠశాలలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉత్తర కాశీ నుండి విచ్చేసిన మాతాజీ పూర్వజానంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాతాజీ పూర్వజానంద మాట్లాడుతూ.. చిన్నారుల్లో ఆధ్యాత్మికత, మంచి సంస్కారాన్ని పెంపొందించడంలో శ్రీకృష్ణుని జీవితం, రామకృష్ణ పరమహంస–వివేకానందుల బోధనలు ఎంతో తోడ్పడతాయని తెలిపారు. వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధాదేవి ఇతర పౌరాణిక పాత్రల ప్రత్యేక వేషధారణలతో అలరించారు. చిన్నారుల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు గోగినేని శివ శ్రీనివాస్, రజిని, నాగశ్రీ, నితిన్ చంద్రలతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## తాండూర్ డిపోను సందర్శించిన ఆర్టీ సీ ఉన్నతాధికారులు

**తాండూర్, సెప్టెంబర్ 04(సమయం న్యూస్)** వికారాబాద్ జిల్లా తాండూర్ ఆర్టీసీ డిపోను ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (IT) రాజశేఖర్, CCE కవిత, EE పోచలింగం శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా డిపో ఉద్యోగులను ఉద్దేశించి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (IT, A, P,) రాజశేఖర్ మాట్లాడుతూ, మహాలక్ష్మి పథకం అమలుతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగి, ఆదాయం పెరుగుతున్న కారణంగా అనేక డిపోలు లాభాల బాటలోకి వస్తున్నాయని తెలిపారు. అదే విధంగా తాండూర్ డిపోను కూడా లాభాల బాటలోకి తీసుకురావడానికి ఉద్యోగులందరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు.అనంతరం డిపో ఆవరణలో అధికారులు, ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా డిపో పరిసరాలను పచ్చదనంతో తీర్చిదిద్దాలని సూచించారు.ఈ సందర్భంగా తాండూర్ మున్సిపల్ చైర్మన్ నీరజ బాల్‌రెడ్డి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (IT, A, M, P,) రాజశేఖర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి, డిపో ఇన్ కమింగ్ గేట్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో వాణిజ్య సముదాయం నిర్మించేందుకు ప్రతిపాదనను అందజేశారు. ఈ స్థలాన్ని వినియోగంలోకి తీసుకురావడం ద్వారా డిపోకు అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్,అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# పదవి పోయిన బాధకంటే.. అవమానించిన తీరే కలచివేసింది

- మహిళలు ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులవ్వాలి : మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)



**ఖమ్మం, సెప్టెంబర్ 4 : ( సమయం న్యూస్ )** మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా స్వతంత్రంగా జీవిస్తూ, ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులుగా మారాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మహిళల చేతుల్లో డబ్బు ఉండాలని, తమకు నచ్చిన విధంగా జీవించే ఆర్థిక స్వేచ్ఛను కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. శుక్రవారం సత్తుపల్లి పట్టణంలోని సిద్ధారం రోడ్డులో గల ఎం.ఆర్. గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో 1000 రోజుల ప్రజా పాలనలో భాగంగా నిర్వహించిన ఇందిర మహిళాశక్తి సదస్సులో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లతో కలిసి పాల్గొన్నారు. మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళలు పెద్ద ఎత్తున ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరవుతున్నారంటే ప్రభుత్వంపై వారికి ఉన్న ప్రేమ, విశ్వాసానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను కుటుంబ సభ్యులుగా భావిస్తూ, వారి ఆర్థిక స్వావలంబనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని మంత్రి తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి గత రెండున్నరేళ్లలో పంచాయతీరాజ్, మహిళా సంఘాల సంక్షేమం, తాగునీరు తదితర రంగాల్లో సుమారు రూ.300 కోట్ల వరకు నిధులు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి పల్లె, గూడెం, తండా, వాడలో అవసరమైన సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.మహిళా సంఘాలు కేవలం పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలోకి రావాలని మంత్రి పిలుపునిచ్చారు. మహిళా ఆర్థిక పురోగతికి కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి మేడారం జాతర సందర్భంగా మహిళా సంఘాలకు సుమారు రూ. 6 కోట్ల మేర రుణ సహాయం అందించగా, మహిళలు కేవలం 15 రోజుల్లో నే సుమారు రూ.9 కోట్ల వ్యాపారం చేసి లాభాలు ఆర్జించారని గుర్తుచేశారు.

సత్తుపల్లిలో కూడా టిఫిన్ సెంటర్లు , క్యాంటీన్లు, డెయిరీ, పౌల్ట్రీ, సోలార్, కుట్టు యూనిట్లు, స్థానికంగా లభించే అటవీ ఉత్పత్తుల ఆధారంగా వివిధ వ్యాపారాలు ప్రారంభించాలని సూచించారు. స్థానికంగా లభించే ఉత్పత్తులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి విక్రయిస్తే మహిళలకు మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, కలెక్టరేట్లు, ఇతర ప్రజలు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో మహిళా సంఘాలతో ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో మహిళలు క్యాంటీన్ల ద్వారా నెలకు రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు ఆదాయం పొందుతున్నారని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, రుణాలపై వడ్డీ భారాన్ని ప్రభుత్వం భరిస్తోందన్నారు. మహిళా సంఘాల సభ్యులకు రుణ బీమా సదుపాయం కల్పిస్తూ, రుణం తీసుకున్న సభ్యురాలు మరణించిన సందర్భంలో నిర్దిష్ట పరిమితి వరకు రుణాన్ని మాఫీ చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు.అదేవిధంగా ప్రమాదవశాత్తు మహిళలు మరణించినప్పుడు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ.10 లక్షల వరకు సహాయం అందిస్తున్నామని చెప్పారు.

### మహిళలకు ఆత్మగౌరవ భవనాలు

మహిళా సంఘాల సమావేశాలు చెట్ల కింద లేదా ఇతరుల ఇళ్ల వద్ద నిర్వహించాల్సిన పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వీవో భవనాలను నిర్మిస్తోందన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే అనేక వీవో భవనాలు మంజూరు చేశామని, ఇంకా అవసరమైన భవనాలను కూడా మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా సమాఖ్యల కోసం రూ. 5 నుంచి రూ.7 కోట్ల వ్యయంతో భవనాలను నిర్మిస్తున్నామని, మహిళల శిక్షణ, సమావేశాలు, వ్యాపార కార్యకలాపాలకు అవి ఉపయోగపడతాయని చెప్పారు.మహిళలు విద్యావంతులై, తమ పిల్లలను ఉన్నత స్థానాలకు తీసుకెళ్లాలని సూచించారు.మహిళలు అత్యవసర సమయాల్లో తమ పనుల కోసం ఎక్కడికైనా స్వేచ్ఛగా వెళ్లే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. మహిళలకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించడంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేర్లపై మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇల్లు , రేషన్ కార్డు వంటి ప్రభుత్వ ప్రయోజనాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని, మినీ అంగన్వాడీలను ప్రధాన అంగన్వాడీలుగా మార్చి సిబ్బందికి వేతనాలు పెంచామని, రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంగన్వాడీ పిల్లలకు యూనిఫాంలతో పాటు అల్పాహారం, పోషకాహారం అందించే కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.అంగన్వాడీ కేంద్రాల్లోనే చిన్నారులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని, పిల్లలను తప్పనిసరిగా ప్రైవేట్ పాఠశాలలకు పంపాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ అంగన్వాడీలను మరింత బలోపేతం చేస్తున్నామని వివరించారు.గ్రామాల్లో లభించే సహజ వనరులు, అటవీ ఉత్పత్తులు, సంప్రదాయ ఆహార పదార్థాలను మహిళలు వ్యాపారాలుగా మలచుకోవాలని మంత్రి సూచించారు. ఇప్పపువ్వు లడ్డూల వంటి స్థానిక ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని, వాటిని పరిశుభ్రంగా, నాణ్యతతో తయారు చేసి మార్కెట్ చేస్తే మహిళలకు మంచి ఆదాయం లభిస్తుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందిస్తున్న పథకాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. చిన్న స్థాయిలో కుట్టు మిషన్‌తో ప్రారంభించిన మహిళలు నేడు పెద్ద కంపెనీలు నిర్వహించే స్థాయికి ఎదుగుతున్నారని అన్నారు. ఖమ్మం జిల్లాలో కూడా మహిళల ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభం కావడం విశేషమని, దాని ద్వారా నెలకు సుమారు రూ. 2.50 లక్షల వరకు ఆదాయం లభించే అవకాశం ఉందని చెప్పారు. మహిళా సంఘాల సభ్యులకు రుణాలు, బీమా తదితర సౌకర్యాలు కల్పించడం ద్వారా ఆర్థిక భద్రతను కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రుణం తీసుకున్న సభ్యురాలు మరణించిన సందర్భంలో కుటుంబ సభ్యులపై రుణభారం పడకుండా లోన్ ఇన్సూరెన్స్, లోన్ వేవర్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ గతంలో మహిళా సంఘాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, రుణాలపై అధిక వడ్డీ భారంతో చాలామంది సభ్యులు సంఘాల నుంచి వైదొలిగిన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగులు తదితర వర్గాల కోసం ప్రత్యేక గ్రూపులను ఏర్పాటు చేసి మహిళా సంఘాల కార్యకలాపాలను మరింత విస్తరిస్తున్నామని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గంలో కొత్తగా సుమారు 470 మహిళా సంఘాలు ఏర్పడటం మహిళల్లో పెరుగుతున్న చైతన్యానికి నిదర్శనమన్నారు. మహిళా సంఘాలకు వారి అర్హతను బట్టి పెద్ద మొత్తంలో రుణాలు అందిస్తున్నామని, ఈ రుణాలపై మహిళలు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం వడ్డీలేని రుణాలను అందిస్తోందని తెలిపారు. రుణాలపై వడ్డీని కూడా ప్రభుత్వం భరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ రెహ్మాన్ బేగం, కల్లూరు ఎసీపీ వసుందర, సత్తుపల్లి మున్సిపల్ కమీషనర్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మన సంస్కృతి మన వారసత్వం.. భావితరాలకు అందిద్దాం

- పండుగలతో పెరిగే బంధాలు.. సంస్కృతితో బలపడే సమాజం... ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**హనుమకొండ, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్) :** సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ వాటి విశిష్టతను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. పండుగలు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా ఉండాలని ఆకాంక్షించారు. 61వ డివిజన్ నవయూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు నిర్వాహకులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లా డుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా కలసి పండుగలను జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. పండుగల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు మరింత బలపడతాయని తెలిపారు. ముఖ్యంగా యువత సంప్రదాయాలను కొనసాగిస్తూ సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని నాయిని అన్నారు. నేటి తరం మన సంస్కృతికి మూలాలను తెలుసుకుని, వాటిని భావితరాలకు అందించే వారధిగా నిలవాలని పిలుపునిచ్చారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా



ప్రజలందరికీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, శాంతి, సౌభ్రాతృత్వం వెల్లి విరియాలని ఆకాంక్షించారు.

# పాడి గేదెలతో పేదింట పాలధార... కుటుంబాలకు ఆర్థిక భరోసా

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం... ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- ఆత్మకూరు, దామెర మండలాలకు 96 పాడి గేదెల యూనిట్ల మంజూరు పత్రాల పంపిణీ



**పరకాల, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్) :** పాడి గేదెల పెంపకం ద్వారా పేద కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూరి ఆర్థికంగా స్వావలంబన సాధించే అవకాశం ఉంటుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మహిళా సంక్షేమం, పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన దళిత కుటుంబాలకు పాడి గేదెల యూనిట్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆత్మకూరు మండలానికి 72, దామెర మండలానికి 24 యూనిట్లు కలిపి మొత్తం 96 యూనిట్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ దళిత కుటుంబాల ఆర్థిక స్వావలంబన, జీవన ప్రమాణాల మెరుగుదల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళల ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

### ప్రతి ఇంటికీ రెండు గేదెలు...

పరకాల ఇందిరా మహిళా డైరీ ద్వారా రాబోయే రెండేళ్లలో దాదాపు 40 వేల కుటుంబాలకు ప్రతి ఇంటికి రెండు పాడి గేదెలు అందించేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. పాడి పరిశ్రమను ఉపాధి అవకాశంగా మలుచుకుని కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఒక్కో యూనిట్ విలువ రూ.2 లక్షలు కాగా.. ఇందులో రూ.1.60 లక్షలు సబ్సిడీ, రూ.40 వేల బ్యాంకు రుణంగా ప్రభుత్వం సమకూరుస్తోందని వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని కోరారు.

### పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం...

అంతకుముందు పశువైద్యులు లబ్ధిదారులకు పాడి గేదెల పెంపకంపై అవగాహన కల్పించారు. పశువులకు అందించాల్సిన పోషకాహారం, వ్యాధుల నివారణ, టీకాలు, వాతావరణ మార్పుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రస్తుతం వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో పశువులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉన్నందున పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని రేవూరి సూచించారు. పశువులకు సకాలంలో టీకాలు, వైద్య పరీక్షలు, పోషకాహారం అందించి ఆరోగ్యంగా పెంచితే పాల ఉత్పత్తి పెరిగి కుటుంబాలకు మరింత ఆదాయం సమకూరుతుందని తెలిపారు.

# బీఆర్ఎస్ పదేళ్ల విధ్వంసాన్ని ప్రజలు మరిచిపోలేదు

- **రోడ్లపై పడుకొని నిరసన కాదు.. పడుకుని బొర్లినా ప్రజలు నమ్మరు... ఎమ్మెల్యే కె.ఆర్ .నాగరాజు**
- **బీఆర్ఎస్ హయాంలో రూ.8.50 లక్షల కోట్ల అప్పులు**



**వర్ధన్నపేట, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్) :** బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని, ఆ సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు అన్నారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన అంటూ బీఆర్ఎస్ చేపడుతున్న నిరసనలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో సుమారు రూ.8.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని ఎమ్మెల్యే ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పరిశీలనలో ఈ అప్పుల భారం వెల్లడైందన్నారు. రాష్ట్రానికి వస్తున్న ఆదాయంలోనే భారీ మొత్తాన్ని అప్పుల అసలు, వడ్డీల చెల్లింపులకు వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఉద్యోగుల జీతాలు, సంక్షేమ పథకాలు, పింఛన్లు తదితర కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు.

**నాలుగు గ్యారంటీలు అమలు చేశాం...**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో నాలుగు ఇప్పటికే అమలు చేశామని నాగరాజు తెలిపారు. ఐదేళ్ల పదవీకాలం పూర్తయ్యేలోపు ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. హామీలను అమలు చేసిన తర్వాతే ప్రజలను ఓట్లు అడుగుతామని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు, ఇవ్వని పలు కార్యక్రమాలను సైతం ప్రజా సంక్షేమం కోసం చేపడుతున్నామని వివరించారు.

**బీఆర్ఎస్ హామీలపై ప్రశ్నలు...**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అనేక హామీలు అమలుకు నోచుకోలేదని ఎమ్మెల్యే విమర్శించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామన్న హామీ, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, ప్రతి కుటుంబానికి ఉద్యోగం, నిరుద్యోగ భృతి, దళిత కుటుంబాలకు మూడెకరాల భూమి వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తికాలేదని, ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లకు నిధుల విషయంలో నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు.

**ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం...**

ప్రజలు అడిగినా, అడగకపోయినా వారి అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్నానని నాగరాజు తెలిపారు. బీఆర్ఎస్ చేస్తున్న అసత్య ఆరోపణలను ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని అన్నారు. తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం మరోసారి అప్పుల పాలై, ప్రజాభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# పచ్చదనం పెంచాలి.. ప్రజలకు ఆహ్లాదం పంచాలి

- **గ్రీన్ ల్యాండ్ ను సుందరంగా తీర్చిదిద్దాలి**
- **పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి... కౌన్సిలర్ హన్మకొండ శ్రీధర్**



**నర్సంపేట, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్) :** పట్టణంలోని 10వ వార్డు వివేకానంద కాలనీలో నెలకొన్న స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించి, గ్రీన్‌ల్యాండ్ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని 10వ వార్డు కౌన్సిలర్ హన్మకొండ శ్రీధర్ మున్సిపల్ అధికారులను కోరారు. శుక్రవారం మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి ఆయన కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. గ్రీన్‌ల్యాండ్ ప్రాంతంలో పనిచేయకుండా ఉన్న మోటార్‌ను వెంటనే మరమ్మతు చేయించాలని అధికారులకు సూచించారు. రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఖాళీగా ఉన్న గ్రీన్‌ల్యాండ్ స్థలాన్ని సుందరీకరించేందుకు పూల మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.

**పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ...**

కాలనీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని శ్రీధర్ అధికారులను కోరారు. కాలనీ పరిసరాల్లో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడంతో పాటు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా వార్డులోని సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ పర్యటనలో మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ కందిక స్వామి, వివేకానంద కాలనీ కమిటీ వాసులు మేడవరపు కమలాకర్‌రావు, ధార గణేష్, బాదం రంజిత్, పాశికంటి రమేష్, గోరంటల మహేందర్, పస్తం కృష్ణమంగ రాజు, నిమ్మరబోయిన బిక్షపతి, కుమారస్వామి, రాజు, దేవులపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకాలకు మించిన పాఠం.. జీవితాన్ని నేర్పే 'గురువు'

- **గురుపూజోత్సవం వేళ.. తరతరాల భవిష్యత్తును తీర్చిదిద్దే మహోన్నత శక్తికి వందనం**



శ్రీనివాస్ దేవులపల్లి స్టాఫ్ రిపోర్టర్ -'సమయం'వరంగల్



**వరంగల్, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్) :** తల్లి జన్మనిస్తే.. తండ్రి జీవితానికి బాసటగా నిలుస్తాడు. కానీ జీవితానికి అర్థం నేర్పేది గురువు. చేతిలోని పెన్నుకు బలం ఇచ్చి.. ఆలోచనలకు రెక్కలు తొడిగి భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయుడే. అందుకే భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రుల తర్వాత గురువుకు అత్యున్నత స్థానం లభించింది. విద్యార్థి చేతిలో పుస్తకం పెట్టడం మాత్రమే గురువు బాధ్యత కాదు. అతడి ఆలోచనల్లో మార్పు తీసుకురావడం, మంచిచెడుల మధ్య తేడా తెలియజేయడం.. క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అలవర్చడం.. సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా తీర్చిదిద్దడం గురువు అసలైన కర్తవ్యం.

**రాధాకృష్ణన్ స్ఫూర్తితో...**

గొప్ప తత్వవేత్త, విద్యావేత్త, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి దేశ అత్యున్నత పదవైన రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన రాధాకృష్ణన్ జీవితం ప్రతి విద్యార్థికీ స్ఫూర్తిదాయకం. విద్యకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యం, సమాజ నిర్మాణంలో గురువు పాత్రపై ఆయనకు ఉన్న విశ్వాసం నేటి తరానికీ మార్గదర్శకం. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందన్న భావనను ఆచరణలో చూపిన మహనీయుడు రాధాకృష్ణన్.

**పాఠ్యపుస్తకాలకు మించిన పాఠాలు...**

కాలం మారింది, సాంకేతికత మారింది, సమాచార ప్రపంచం అరచేతిలోకి వచ్చింది. అయినా గురువు స్థానం మాత్రం చెక్కుచెదరలేదు. ఇంటర్నెట్ సమాచారం ఇవ్వగలదు, కానీ దాన్ని ఎలా ఉపయోగించాలో నేర్పేది గురువు. పుస్తకం జ్ఞానాన్ని అందించగలదు.. కానీ ఆ జ్ఞానాన్ని జీవితంలో ఎలా ఆచరించాలో చూపేది గురువు. మార్కులు ఉద్యోగానికి మార్గం చూపొచ్చు కానీ సంస్కారం మనిషికి గౌరవాన్ని తెస్తుంది. డిగ్రీ జీవనోపాధిని అందించొచ్చు కానీ గురువు నేర్పిన విలువలే జీవితానికి అర్థాన్ని ఇస్తాయి.

**గురువు.. భావితరాల శిల్పి...**

ఒక శిల్పి రాయిలోని అందాన్ని వెలికి తీసినట్లే.. గురువు విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి వెలుగులోకి తెస్తాడు. ఓడిపోయినప్పుడు ధైర్యం చెబుతాడు, తప్పు చేసినప్పుడు సరిదిద్దుతాడు. విజయం సాధించినప్పుడు ఒదిగి ఉండాలని నేర్పుతాడు. ఈరోజు ఉన్నత స్థానాల్లో ఉన్న ప్రతి ఒక్కరి విజయగాథ వెనుక ఏదో ఒక దశలో ఒక గురువు ప్రోత్సాహం తప్పకుండా ఉంటుంది. అందుకే గురువు చేసిన సేవకు కొలమానం లేదు.. ఆయన ఇచ్చిన జ్ఞానానికి వెలకట్టలేం.

**గొప్ప బహుమతి.. మంచి విద్యార్థి...**

గురువుకు ఇచ్చే నిజమైన గురుదక్షిణ ఖరీదైన కానుక కాదు. ఆయన నేర్పిన విలువలను జీవితంలో ఆచరించడం, మంచి మనిషిగా ఎదగడం, సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా నిలవడమే గురువుకు ఇచ్చే గొప్ప బహుమతి. ఒక విద్యార్థి జీవితంలో విజయం సాధించి "నేను ఈ స్థాయికి రావడానికి నా గురువే కారణం" అని గర్వంగా చెప్పినప్పుడు అదే ఉపాధ్యాయుడికి దక్కే అసలైన గౌరవం.

**గురువుకు శతకోటి వందనాలు...**

"మాతృదేవోభవ.. పితృదేవోభవ.. ఆచార్యదేవోభవ" అన్న భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని మరోసారి గుర్తుచేసుకునే రోజు గురుపూజోత్సవం. మన చేతిని పట్టుకుని తొలి అక్షరం నేర్పిన గురువు నుంచి జీవితంలో సరైన దారిని చూపిన ప్రతి ఉపాధ్యాయుడి వరకు అందరికీ ఈ రోజు కృతజ్ఞతలు చెప్పుకోవాలి. గురువు ఒక వ్యక్తి కాదు, ఒక వెలుగు. గురువు ఒక వృత్తి కాదు, ఒక మహత్తర బాధ్యత. గురువు ఒక బోధకుడు కాదు.. భావితరాల శిల్పి. గురువు వెలిగించిన జ్ఞానదీపం ఒక విద్యార్థి జీవితాన్నే కాదు సమాజం మొత్తాన్ని వెలిగిస్తుంది. గురుపూజోత్సవం సందర్భంగా జ్ఞానాన్ని పంచుతూ భావితరాలను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులందరికీ హృదయపూర్వక వందనం.

# రైతు పంటకు రక్షణ కవచం.. పరకాల మార్కెట్‌కు రూ.2.18 కోట్లు

- **పరకాల వ్యవసాయ మార్కెట్ లో ఇంటిగ్రేటెడ్ కవర్ షెడ్ , రైతు స్టాంచ్ నిర్మాణానికి రూ.2.18 కోట్లు మంజూరు**
- **ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని సత్కరించిన మార్కెట్ కమిటీ**



**పరకాల, సెప్టెంబర్4 (సమయం న్యూస్) :** పరకాల వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే రైతుల ధాన్యాన్ని వర్షాల నుంచి రక్షించేందుకు ఇంటిగ్రేటెడ్ కవర్ షెడ్, రైతు స్టాంచ్ నిర్మాణానికి రూ.2.18 కోట్లు మంజూరయ్యాయి. మార్కెట్‌ను అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చొరవతో నిధులు మంజూరైన సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మార్కెట్‌లో రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని వర్షాకాలంలో తడవకుండా భద్రపరిచేందుకు కవర్ షెడ్ నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు మార్కెట్ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను కల్పించాలనే లక్ష్యంతో ఈ నిర్మాణాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్ (బుజ్జన్న)తో పాటు డైరెక్టర్లు బుడేమే రాజయ్య, గాదె విజయ్, ఎండీ రంజాన్, బొమ్మకంటి రుద్రమ చంద్రమౌళి, పెండెల కుమార్‌స్వామి తదితరులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని శాలువా, కండువాతో ఘనంగా సత్కరించారు. రైతుల ప్రయోజనాలే కేంద్రంగా మార్కెట్ అభివృద్ధి చేపట్టడం పట్ల కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## 22-ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

- **ప్రజల ఆస్తి హక్కులను పరిరక్షించాలంటూ జనసేన భారీ నిరసన దీక్ష**
- **ఇందిరాపార్కు ధర్నాచౌక్ లో పాల్గొన్న నర్సంపేట నియోజకవర్గ నాయకుడు మేరుగు శివకోటి యాదవ్**



**నర్సంపేట/వరంగల్, సెప్టెంబర్ 4 (సమయం న్యూస్) :** తెలంగాణలో 22–ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రజల ఆస్తి హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద శుక్రవారం భారీ నిరసన దీక్ష నిర్వహించారు. జనసేన తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్‌గౌడ్ అధ్యక్షతన చేపట్టిన ఈ దీక్షకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నిరసన దీక్షలో వరంగల్ జిల్లా, నర్సంపేట నియోజకవర్గ నాయకుడు మేరుగు శివకోటి యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 22–ఏ భూముల సమస్య కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం కల్పించాల్సిన అవసరాన్ని జనసేన నాయకులు ప్రస్తావించారు. ప్రజల ఆస్తి హక్కులకు భంగం కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివిధ జిల్లాలు, నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసన దీక్షకు మద్దతు తెలిపారు. ప్రజల భూములు, ఆస్తులకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. నిరసన దీక్షకు జనసేన రాష్ట్ర ముఖ్య నాయకులు ఆర్కే సాగర్, రాధారపు రాజలింగం, ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్, మేకల సతీష్‌రెడ్డి, గడల శ్రీనివాసరావు, మచ్చ సుధాకర్, సంపత్ నాయక్, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ దామోదర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. వీర మహిళ విభాగం రాష్ట్ర నాయకురాలు మండపాక కావ్యతో పాటు శిరీష, నివిత తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన: డీఐజీ చందన దీప్తి, ఎస్పీ డాక్టర్ వినీత్




**మద్దూరు, సెప్టెంబర్ 4(సమయం న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మద్దూరు మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల, గురుకుల పాఠశాల–కళాశాల భవనాల నిర్మాణ పనులను పరిశీలించేందుకు వచ్చిన సందర్భంగా జోగులాంబ జోన్–7 డీఐజీ చందన దీప్తి, IPS మరియు నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, IPS బందోబస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు డీఐజీ, ఎస్పీ సూచించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలు, పార్కింగ్ ప్రాంతాలు, రోడ్డు ఓపెనింగ్ రూట్ బందోబస్తు ప్రవేశ–నిష్క్రమణ మార్గాలు, వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను వారు పరిశీలించి భద్రత పరమైన సూచనలు చేశారు.

## షార్ట్ సర్క్యూట్ తో వ్యక్తిమృతి

**యాలాల మండలం, సెప్టెంబర్,04(సమయం న్యూస్)** విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం సాయంత్రం యాలాల మండల పరిధిలోని ముద్దాయి పేట గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజు పూలగోని (40) తన కిరాణా షాపులో డబ్బాలలో పెట్రోల్ నింపి తర్వాత ఇంటికి వెళ్లి ఇంట్లో ఉన్న కరెంటు బోర్డు స్విచ్ ఆన్ చేసి ఎందుకు ప్రయత్నించగా కరెంటు షాక్ కు గురై మంటలు చెలరేగి రాజుకు శరీరం మొత్తం కాలిన గాయాలు కాగా చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారన్నారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించాడని వైద్యులు నిర్ధారించారన్నారు. మృతుడు రాజు మేనమామ నరేంద్ర గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విఠల్ రెడ్డి తెలిపారు.

## ఊరికి వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

**యాలాల మండలం, సెప్టెంబర్,04(సమయం న్యూస్)** ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్ళి, తిరిగి వచ్చేసరికి దొంగలు ఇంటిని గుల్ల చేశారు. సుమారు 5 తులాల బంగారు ఆభరణాలు, 1.5 కిలోల వెండి, విలువైన వస్తువులు కాజేశారు. యాలాల మండల పరిధిలోని కోకట్ శ్రీరామ్ నగర్ కాలనీలోఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోకట్ శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన ముచ్చర్ల వెంకటేశం ఈనెల 2వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి సేడంకి వెళ్లి పని ముగించుకొని శుక్రవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటం గమనించి లోపలికి వెళ్లి చూడగా అల్మారా తాళం పగలగొట్టి అందులో ఉన్న సుమారు 5 తులాల బంగారు ఆభరణాలు, 1.5 కిలోల వెండి, విలువైన వస్తువులు దొంగతనం జరిగినట్టుగా గుర్తించారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విఠల్ రెడ్డి తెలిపారు.



# తొలి తెలుగు క్రైస్తవ కవి పురుషోత్తమ చౌదరి

## నేడు పురుషోత్తమ చౌదరి జయంతి

ఆంధ్రక్రైస్తవ సంకీర్తనా పితామహులు, తెలుగు క్రైస్తవ సంఘ పితామహుడు అని పిలువబడే కవిశేఖరుడు చౌదరి పురుషోత్తం పేరు వినని, ఆయన పాట గానం చేయని తెలుగు క్రైస్తవులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. ప్రముఖ వాగ్గేకారుల, ముఖ్యంగా త్యాగరాయ కృతులతో గేయకవిత శిఖరాయమాన ప్రాభవాన్ని సంతరించుకొన్న 19వ శతాబ్దిలో, హిందూ దేవుళ్ళనే కీర్తించేందుకు కృతులుగాని, కీర్తనలు గాని కోకొల్లలుగా జన బాహుళ్యానికి అందుబాటులోకి వచ్చిన తరుణంలో 19వ శతాబ్ది పూర్వార్ధంలోనే మొట్ట మొదటి సారిగా అన్య మతానికి చెందిన దేవుని కీర్తించేందుకు కీర్తనలను రచించిన కవి పురుషోత్తమ చౌదరి. 19వ శతాబ్దిలో క్రైస్తవ మతాన్ని స్వీకరించి, మనసా, వాచా, కర్మణా, క్రైస్తవ మత ప్రచారార్ధం రచనలు చేసిన తొలి తెలుగు క్రైస్తవ కవి పురుషోత్తమ చౌదరి. అనేక క్రైస్తవ పద్య కృతులను, కీర్తనలను రచించి ఆంధ్రక్రైస్తవ సార్వభౌముడు'గా ఖ్యాతి నొందారు. పురుషోత్తం చౌదరి (సెప్టెంబరు 5, 1803 – ఆగష్టు 23, 1890) తెలుగు క్రైస్తవ పదకవితా పితామహుడు. తొలి తెలుగు క్రైస్తవ వాగ్గేయకారులు. సి.పి. బ్రౌన్, త్యాగరాజుకు సమకాలికులు. తాను రాసిన కీర్తన లను స్వయంగా గానం చేస్తూ ప్రజా బాహుళ్యానికి అందించారు. శ్రీకాకుళం జిల్లా తెంబూరు (పాతపట్నం) శివారు మదనాపురం (తెంబూరు (పాతపట్నం) లో 1803, సెప్టెంబరు 5 న బెంగాలీ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన సుభద్రాదేవి, కూర్మానాథ చౌదరి దంపతులకు జన్మించారు. తల్లివీరి పూర్వీకులు పశ్చిమ బెంగాలు నుండి ఒరిస్సా ప్రాంతానికి వచ్చి స్థిరపడిన బెంగాల్ బ్రాహ్మణులు. తమ మతాచారాల ప్రకారం పురుషోత్తమ చౌదరికి ఏడు సంవత్సరాలప్పుడే ఉపనయన సంస్కారం జరిపి, గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించారు. పురుషోత్తం చౌదరి బాల్యం నుండే మతనిష్ట కలిగి ఉండేవారు. నిరంతర విగ్రహారాధన, తీర్థ యాత్రలతో పాటు భుజాలపై వైష్ణవ మత సూచకాలైన శంఖు చక్రాల్ని కూడ కాల్పించు కొన్నారు. 1823 లో తన మేనమామ కుమార్తె యైన రాధామణి దేవిని వివాహం చేసికొన్నారు. సంస్కృతం, ఒరియా, తెలుగు భాషల్లో ప్రావీణ్యతను సంపాదించి, 20 సంవత్సరాలకే కవిత్వం రాయడం ఆరంభించారు. క్రైస్తవ్యాన్ని స్వీకరించక మునుపు చాలా హిందూ మత సంబంధిత భక్తి రచనల్ని చేశారు. ఆయన తన అన్న గారి పాఠశాలలో పనిచేస్తుండే వారు. అప్పుడే క్రైస్తవ్యం పట్ల ఆసక్తి కలిగి, దాని గురించి తెలుసు కోవాలనే తపనతో అన్వేషించడం మొదలు పెట్టారు. అదే సమయంలో ఆధునిక ప్రేషిత పితామహుడుగా పేరుగాంచిన విలియమ్ కేరీ తెలుగులో వ్రాసిన కరపత్రం ఒకటి పురుషోత్తంకు చేతికి అందింది. అది చదివిన పురుషోత్తంకు క్రీస్తు గురించి మరి యెక్కువగా తెలుసు కోవాలని పించింది. దైవ సంకల్పం ప్రకారం మిషనరీ హెలెన్ నాట్, విలియమ్ డాసన్ మొదలైన క్రైస్తవ ప్రముఖులతో పరిచయం కలిగటం, అప్పటికే రెవ. ప్రిచెట్ (1818) తెలుగులో అనువదించిన నూతన నిబంధన తన చేతికందటంతో ఆయన ఆశ నెరవేరింది. పురుషోత్తం చౌదరి దాన్ని బాగా చదివారు. 1829 లో విశాఖపట్నంలో క్రైస్తవ సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. 1833 అక్టోబరు 6 వ తేదీన క్రీస్తుని అనుసరించాలని నిర్ణయించు కొన్నారు. 1833లో 'కులాచార పరీక్ష' అనే పత్రికను రాసి, కులవ్యవస్థను ఖండించారు. 1833 అక్టోబరులో కటక్‌లో 'బాప్తిస్మం' తీసుకొని, క్రైస్తవ మత ప్రచారం ప్రారంభించారు. 18 రోజులు కాలినడకన పాటలు పాడుకుంటూ ప్రచారం చేస్తూ మద్రాసు వెళ్లారు. 1833 అక్టోబరు 6 వ తేదీన అదే రోజు తన తోటి క్రైస్తవులతో కలిసి ఆరాధిస్తూ..."మా యేసుక్రీస్తుని – మరుగు గల్గెనురా, నా యాత్మ ఘన రక్ష – నగము నెక్కెనురా"...అనే కీర్తనను పాడారు. అది తెలుగులో వెలువడిన మొట్టమొదటి క్రైస్తవ గీతం. పురుషోత్తం క్రైస్తవుడవ్వడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల నుండి ఎంతో వ్యతిరేకతను, మరెన్నో అవరోధాలను ఎదుర్కోవలసి వచ్చింది. కాని ఈ శోధనలన్నీ తనలో నిరాశను కలిగించడానికి బదులుగా తాను పొందిన రక్షణానుభవాన్ని ఇతరులకు ప్రకటించాలనే తృష్ణను పెంచాయి. 1836 ఏప్రిల్ 3 వ తేదీన ఆయన భార్య రాధామణి దేవి కూడా క్రైస్తవ్యాన్ని స్వీకరించారు. ఆ సంవత్సరమే చౌదరిని మిషనరీగా అభిషేకించారు. అనేక శ్రమలకు, తిరస్కారాలకు గురైనప్పటికీ, విశ్వాసంలో వెనుకడుగు వేయక, వేలకొలది మైళ్ళు కాలినడకను ప్రయాణించి, ఆంధ్ర దేశంలో అధికభాగం పర్యటిస్తూ విస్తృత సేవ చేసి, తెలుగు క్రైస్తవ సంఘ పితామహుడయ్యారు. చౌదరి విరచిత ఆణిముత్యాల లాంటి పాటలన్నీ కేవలం భక్తిపూరిత మైనవే కాకుండా, సాహితీ సంపదతో తుల తూగు తుంటాయి. కేవలం కీర్తనల్ని మాత్రమే గాక " క్రైస్తవ నీతి ప్రకాశం, సత్య వేద సార సంగ్రహం, "కులాచార పరీక్ష" ఇత్యాది ఎన్నో గ్రంథాల్ని కూడా రచించారు. ఆయన రచనల్లో ఎక్కువగా విగ్రహారాధనని ఖండించారు. ఆయన వ్రాసిన ప్రతి పాట స్వీయ జీవితానుభవ లోతుల్లో నుండి పెల్లుబికినదే. అందుకే అవి ఈ నాటికీ తెలుగు క్రైస్తవ సాహిత్యంలో సజీవ సంకీర్తనలుగా నిలిచి పోయాయి. 1882 లో కనుచూపు పూర్తిగా మందగించిన సమయంలో తన కుమార్తెను పిలిపించుకొని, "సకలేంద్రియములారా – చాలు మీ పనిదీరె" అనే పాటను పాడి, ఆమెచే వ్రాయించారు. చివరకు 1890, ఆగస్టు 26 న తన 87 వ యేట ప్రభువుని చేరుకొన్నారు. చౌదరి కవి ఎన్నో కీర్తనలు రచించారు. పద్య కావ్యాల రచనలలో పద్య కృతులు ఐదు లభిస్తున్నాయి. వాటిలో రెండు శతకాలు – ఒకటి 'యేసు నాయక శతకము'; రెండవది 'యేసు క్రీస్తు ప్రభు శతకము'. ఇక, 'పంచ చామర పన్నములు' పంచ చామర ఛందస్సులో మకుట సహితంగా యెహటరీవాను దలతున్" అన్న కీర్తనను పొందు పరిచాడు కవి. సాగిన అర్ధశతి. 'పంచ రత్నములు' ఐదు సీస పద్యాల సంకలనం. క్రైస్తవ నీతి ప్రకాశము, 'సత్యవేద సార సంగ్రహము' అనేవి పద్య కావ్యాలు, వీటిలో క్రీ.శ. 1845లో వెలువడిన 'యేసు నాయక శతకము' తెలుగు శతక వాఙ్మయంలో మొట్టమొదటి క్రైస్తవ శతకం. ప్రస్తుతం చౌదరి రాసిన కీర్తన వినిపించని చర్చి, క్రైస్తవుల ఇళ్లు లేవు. . 1933లో చౌదరి శతజయంతి ఉత్సవాలు ఆంధ్రా – ఒరిస్సాలో ఘనంగా నిర్వహించారు. పురుషోత్తమ చౌదరి స్వహస్తాలతో శ్రీకాకుళం చిన్న బజారులోని తెలుగు బాప్టిస్టు చర్చిని దాదాపు 150 ఏళ్ల క్రితం నిర్మించారు. ఆయన భార్య శ్రీకాకుళంలోనే మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# 'పితాజీ'గా శిష్య హృదయాల్లో నిలిచిన విద్యా తాపసి



**ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముద్దు రామకృష్ణయ్య స్మరణ**

**కటిక పేదరికం నుంచి బీబీసీ వరకు అసాధారణ ప్రస్థానం**

**ప్రపంచ దేశాలు తిరిగి విద్యా విధానాలపై అధ్యయనం**

**జగిత్యాల విద్యారంగంలో వినూత్న ప్రయోగాలకు శ్రీకారం**

**వేలాది విద్యార్థుల జీవితాలకు దిశానిర్దేశం చేసిన మహోపాధ్యాయుడు**

ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యావేత్త.. సమున్నత ఆశయాలు కలిగిన వ్యక్తి.. విద్యార్థికి పాఠం చెప్పడమే కాదు.. పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడమే విద్యకు అసలైన అర్థమని ఆచరణలో చూపిన మహోపాధ్యాయుడు ముద్దు రామకృష్ణయ్య. విద్యారంగ అభివృద్ధికే జీవితాన్ని అంకితం చేసి, వినూత్న ప్రయోగాలతో వేలాది మంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసిన ఆయనను శిష్యలోకం ప్రేమగా 'పితాజీ' అని పిలుచుకుంది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆ విద్యా తాపసి జీవిత ప్రస్థానాన్ని స్మరించుకోవడం భావితరాలకు స్ఫూర్తిదాయకం. 1907 అక్టోబర్ 18న అవిభక్త కరీంనగర్ జిల్లాలోని చారిత్రక మంథనిలో సంప్రదాయ పేద కుటుంబంలో ముద్దు రామకృష్ణయ్య జన్మించారు. ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నా చదువుపై ఆయనకున్న తపన మాత్రం తగ్గలేదు. ఉన్నత విద్య కోసం దేశ సరిహద్దులను దాటాలనే సంకల్పంతో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. ఆ కాలంలో విదేశాలకు వెళ్లి చదువుకోవడమే గొప్ప సాహసం. అలాంటి పరిస్థితుల్లో ఇంగ్లాండ్‌లో విద్యాభ్యాసం కోసం హోటల్‌లో పనిచేయడంతో పాటు చౌకీదారుగా కూడా విధులు నిర్వర్తిస్తూ తన చదువును కొనసాగించినట్లు ఆయన జీవిత విశేషాలు చెబుతున్నాయి. కష్టాలను అవకాశాలుగా మలుచుకుంటూ ఆంగ్ల భాషపై పట్టు సాధించారు.

### బీబీసీలో న్యూస్ రీడర్‌గా..


తన ప్రతిభతో ప్రతిష్ఠాత్మక బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్‌లో న్యూస్ రీడర్‌గా పనిచేసే స్థాయికి ఎదిగారు. సిలోన్, బర్మా, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, అమెరికా, ఫ్రాన్స్, ఇటలీ, ఈజిప్ట్, అరేబియా, రష్యా తదితర ప్రాంతాల్లో పర్యటించి అక్కడి విద్యా విధానాలు, సంస్కృతి, సంప్రదాయాలను అధ్యయనం చేశారు. విదేశాల్లో సంపాదించిన అనుభవాన్ని స్వదేశంలోని విద్యారంగానికి ఉపయోగించాలన్న సంకల్పంతో భారత్‌కు తిరిగివచ్చారు. విజయవాడ ఆకాశవాణిలో సహాయ సంచాలకుడిగా పనిచేసినా.. తన అసలు గమ్యం విద్యారంగమేనని భావించారు. విద్యావ్యవస్థలో మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రభుత్వ విద్యాశాఖలోకి అడుగుపెట్టారు.

### జగిత్యాలలో మొదలైన విద్యా విప్లవం

నిజామాబాద్ జిల్లా విద్యాధికారిగా, అనంతరం వరంగల్ బీఈడీ కళాశాల వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేశారు. రాష్ట్రంలో బహుళార్థ సాధక పాఠశాలల ఏర్పాటు జరుగుతున్న సమయంలో స్వయంగా కోరుకుని 1958–59 విద్యా సంవత్సరంలో జగిత్యాల బహుళార్థ సాధక ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించారు. అదే పాఠశాల నేడు 'ఓల్డ్ హైస్కూల్'గా చిరపరిచితం. అప్పట్లో సుమారు వంద మంది ప్రతిభావంతులైన ఉపాధ్యాయ బృందానికి మార్గనిర్దేశం చేస్తూ, దాదాపు రెండు వేల మంది విద్యార్థుల విద్యాబోధనకు నాయకత్వం వహించారు. సమయపాలన, క్రమశిక్షణ, బాధ్యత, నైతిక విలువలతో కూడిన విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. పాఠ్యపుస్తకంలోని పాఠంతోనే విద్య పూర్తికాదని.. విద్యార్థిలో వ్యక్తిత్వ వికాసం, బాధ్యత, ఆత్మవిశ్వాసం పెంపొందాలని విశ్వసించారు.

### ఆ రోజుల్లోనే సాంకేతిక విద్యాబోధన

కాలానికి ఎంతో ముందుండే ఆలోచనలు రామకృష్ణయ్య సొంతం. పాఠశాలలో ఈతకొలను నిర్మించడంతో పాటు అప్పట్లోనే తరగతి గదుల్లో స్పీకర్లు ఏర్పాటు చేయించారు. తన చాంబర్‌లో ప్రత్యేక నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచే తరగతి గదుల్లోని విద్యార్థులతో నేరుగా మాట్లాడే విధానాన్ని ప్రవేశపెట్టారు. నేటి ఆధునిక సమాచార వ్యవస్థలను గుర్తుచేసే ఇటువంటి సాంకేతిక ప్రయోగాలను దశాబ్దాల క్రితమే విద్యాబోధనలో ఉపయోగించడం ఆయన దూరదృష్టికి నిదర్శనం. 1965 జూన్ 26న పదవీ విరమణ చేసే వరకు అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ఆయన క్రమశిక్షణ ఎంత కఠినంగా ఉండేదో.. విద్యార్థుల పట్ల ప్రేమ కూడా అంతే ఆత్మీయంగా ఉండేది. అందుకే శిష్యులు ఆయనను ఉపాధ్యాయుడిగా మాత్రమే కాకుండా తండ్రి స్థానంలో నిలిపి 'పితాజీ' అని ప్రేమగా పిలుచుకున్నారు.




### గురువు జ్ఞాపకంగా నిలిచిన విగ్రహం

రామకృష్ణయ్య సేవలను స్మరించుకుంటూ ఆయన శతజయంతి వేడుకలను శిష్యులు ఘనంగా నిర్వహించారు. ఆయన శిష్యుడు, జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం విగ్రహ దాతగా ముందుకొచ్చారు. 2010 సెప్టెంబర్ 7న జగిత్యాల ఓల్డ్ హైస్కూల్‌లో 'పితాజీ' విగ్రహాన్ని ఆవిష్కరించారు. రామకృష్ణయ్య ప్రియశిష్యుడు సూరజ్ శివశంకర్ నిర్వహణలో, గిరి నాగభూషణం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అప్పటి ఉన్నత విద్యాశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎలగందుల రమణ, తాడిపర్తి జీవన్‌రెడ్డి, అప్పటి జగిత్యాల ఆర్డీవో అమయ్‌కుమార్, కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్వర్‌రాజు తదితరులు పాల్గొని రామకృష్ణయ్యకు నివాళులర్పించారు.

### గురువు అంటే పాఠం కాదు.. జీవన మార్గం

నిరాడంబర జీవితం, నిస్వార్థ సేవ, హాస్యభరిత ప్రసంగం, మానవత్వం, క్రమశిక్షణ.. ఇవన్నీ ముద్దు రామకృష్ణయ్య వ్యక్తిత్వంలో అంతర్భాగాలు. ప్రపంచాన్ని చూసిన అనుభవాన్ని తనకోసం దాచుకోకుండా విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టుబడిగా మార్చారు. ఆధునిక సాంకేతికతను విద్యాబోధనకు జోడించాలన్న ఆయన ఆలోచనలు కాలానికంటే ఎంతో ముందున్నాయి. 1985 అక్టోబర్ 21న ఆయన జీవిత ప్రస్థానం ముగిసినా.. తీర్చిదిద్దిన శిష్యుల్లో, జగిత్యాల ఓల్డ్ హైస్కూల్ చరిత్రలో, విద్యారంగానికి అందించిన వినూత్న ఆలోచనల్లో 'పితాజీ' ముద్దు రామకృష్ణయ్య ఇప్పటికీ సజీవమే. ఉపాధ్యాయుడు ఒక తరగతిని మాత్రమే కాదు.. తరతరాల భవిష్యత్తును తీర్చిదిద్దగలడని నిరూపించిన ఆయన జీవితం ఉపాధ్యాయ లోకానికి ఓ పాఠం.. భావితరాలకు ఓ స్ఫూర్తి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలచిన రచయిత రెంటాల



**నేడు రెంటాల గోపాలకృష్ణ జయంతి**

రెంటాల గోపాలకృష్ణ, (5 సెప్టెంబర్ 1920–18 జూలై 1995) తెలుగు సాహిత్య భూమికపై తనదైన ముద్ర వేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. రచయిత, పాత్రికేయుడు, సంపాదకుడు, విమర్శకుడు, అనువాదకుడు, నాటకకర్తగా ఆయన సాహిత్య సేవ విస్తృత పరిధిని కలిగి ఉంది. భావ ప్రకటనను సామా జిక బాధ్యతగా స్వీకరించి, సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలచిన రచయితగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. గుంటూరు జిల్లా రెంటాల గ్రామంలో 1920లో జన్మించిన గోపాలకృష్ణ, బాల్యంలోనే పఠనంపై ఆసక్తి కలిగి చరిత్ర, ఆర్థికశాస్త్రాలలో విద్యాభ్యాసం చేశారు. విద్యాభ్యాసం తరువాత పాత్రికేయ వృత్తిలోకి అడుగుపెట్టి, 'ఆంధ్రప్రభ' పత్రికలో ఉపసంపాదకుడిగా తన జర్నలిజం జీవితాన్ని ప్రారంభించారు. ఆపై 'ఈనాడు' పత్రికలో కీలక పదవులు నిర్వహించారు. వార్తలను సామాజిక రాజకీయ విశ్లేషణతో సమన్వయం చేస్తూ, నూతన దృక్పథాన్ని పాఠకుల ముందు ఉంచారు. ఆయన రాసిన సంపాదకీయాలు పాఠకుల ఆలోచనా సరళిని ప్రభావితం చేశాయి. పత్రికా రచనను ప్రాణంలా భావించిన గోపాలకృష్ణ, మాతృభూమి, అభ్యుదయ, విజయప్రభ, ఆనందవాణి, ఆంధ్రజ్యోతి వారపత్రిక, స్వాతి మాసపత్రిక, బాలజ్యోతి పిల్లల పత్రిక వంటి అనేక ప్రముఖ ముద్రిత మాధ్యమాల్లో రచనలు కొనసాగించారు. వార్తల వెనుకనున్న సంక్లిష్టతను విశ్లేషించి ప్రజలకు చేరువ చేసే శైలితో ఆయన పాత్రికేయత విలక్షణంగా నిలిచింది. ఆయన కలం మానవీయ విలువలకు ప్రతిబింబంగా మారింది. సాహిత్య రంగంలో కూడా గోపాలకృష్ణ అభినవ దిశల్లో ప్రయాణించారు. ఇది నా కథ కాదు, కాలం కాకిలా ఎగిరింది, మనిషి స్వప్నం వంటి నవలల్లో వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక నిరంకుశత, కుల వ్యవస్థలపై పోరాటం వంటి అంశాలను శక్తివంతంగా చిత్రించారు. ఆయన కథలు చిన్నవైనా భావ వ్యాప్తి లోతుగా, మానవ స్వభావం లోని అంతర్లీన సంఘర్షణలను ప్రతిఫలించే విధంగా ఉండేవి. ఆయన రచనల్లో సామాజిక స్పృహ స్పష్టంగా ప్రతిఫలించేది. అనువాద రంగంలో గోపాలకృష్ణ చేసిన కృషి విశేషంగా నిలిచింది. ముఖ్యంగా మార్క్సిస్ట్ సిద్ధాంతాలకు సంబంధించిన పలు ఆంగ్ల గ్రంథాలను తెలుగులోకి అనువదించి, అభ్యుదయ భావజాలాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. అనువాదాన్ని ఆయన భాషాంతరం కాదని భావాంతరంగా చూసారు. భావ గంభీరతను, భాషా సామర్థ్యాన్ని సమన్వయించుతూ చేసిన ఆయన అనువాదాలు తెలుగులో విశిష్టమైన స్థానం సంపాదించాయి. విమర్శా రచనలలో గోపాలకృష్ణ నిర్మాణాత్మక దృష్టితో, నిశితంగా, వాస్తవతను విశ్లేషించగల శైలితో నిలిచారు. వ్యక్తిగత అభిప్రాయాల కన్నా సామాజిక అవసరాలను ప్రతిబింబించగల రచనలవైపు దృష్టిపెట్టి, సమకాలీన సాహిత్యంపై గంభీరంగా స్పందించారు. ఆయన విమర్శలు సాహిత్యాన్ని తన సామాజిక బాధ్యత గుర్తు చేసుకునేలా చేసేవి. సంపాదకునిగా గోపాలకృష్ణ పాత్ర అసాధారణంగా నిలిచింది. అభ్యుదయ రచయితలకు ప్రోత్సాహం ఇచ్చి, వారి రచనలకు పత్రికల్లో చోటు కల్పించారు. నూతన రచయితలను తీర్చిదిద్దడంలో ఆయన నైపుణ్యం ప్రత్యేకమైనది. సంపాదకత్వాన్ని కేవలం పేజీల ఆవరణగా కాక, ప్రజా చైతన్య వేదికగా మలచిన వ్యక్తిగా ఆయన సాహిత్య చరిత్రలో గుర్తింపు పొందారు. సమకాలీన సమస్యలపై మౌలిక విమర్శను మేల్కొల్పే వ్యాసాల ద్వారా పాఠకులలో కొత్త దృక్పథాన్ని పెంపొందించారు. రచయితగా గోపాలకృష్ణను ప్రత్యేకంగా నిలిపే అంశాల్లో ముఖ్యమైనవి – పదజాలంలో స్పష్టత, భావ ప్రకటనలో లోతు, విమర్శలో నిజాయితీ, సంపాదకత్వంలో తాత్త్విక నిబద్ధత. రచనను వృత్తిగా కాక, బాధ్యతగా పరిగణించి, జీవితాన్ని సాహిత్యానికి అంకితం చేసిన అరుదైన ఉదాహరణగా ఆయన నిలిచారు. రెంటాల గోపాలకృష్ణ రచనలు నేటికీ సమకాలీనతను కలిగి ఉన్నాయి. సామాజిక సమస్యలను కేంద్రంగా ఉంచుకుని, మార్పుకు మార్గనిర్దేశం చేసే శక్తిని వాటిలో నిక్షిప్తం చేశారు. ఆయన జీవితమే ఒక ఉద్యమం, రచనలే ఒక సందేశం. భావసాంద్రతతో కూడిన ఆయన రచనలు పాఠకులను కలచి వేస్తాయేమో కానీ, తేలికగా వదిలిపెట్టవు. ఆయన కలం ప్రశ్నించేది – సమాజాన్ని, చట్టాలను, మనవాణ్ని. ఆయన రచనలను చదవడం ద్వారా మనం మనల్ని మళ్ళీ ఆలోచించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. రెంటాల గోపాలకృష్ణ ఒక రచయిత మాత్రమే కాదు – ఒక అభ్యుదయ దృక్కోణం. సాహిత్యాన్ని మార్పు కోసం, మానవీయత కోసం, సమాజపు అణగారిన గొంతుకలకు మద్దతుగా వినిపించిన ఆత్మగాథగా ఆయన రచనలు నిలిచి పోయాయి. తెలుగు సాహిత్యంలో ఆయన ఒక శాశ్వత శిఖరం. ఆయన రచనలను మనం గౌరవించాలి కాదు – అనుసరించాలి. ఎందుకంటే ఆయన కలం భావాలకు మార్గాన్ని చూపినది, సమాజానికి దిక్సూచి అయినది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494